# ఇయ్యాల తెలంగాణ

IYYALATELANGANA

మన భాష – మన యాస

iyyalatelangana.com | facebook.com/iyyalatelangana | twitter.com/iyyalatelangana | printerest./iyyalatelangana

హైదరాబాద్ | గురువారం, 03-09-2026 | సంపుటి :13 | సంచిక :36 | పేజీలు 8 | వెల. రూ॥ 4 /-


## రేవంత్ రెడ్డి 1,000 రోజుల పాలనపై హైదరాబాద్ లో పోస్టర్లు

హైదరాబాద్ ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇటీవలే 1,000 రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ప్రజాప్రభుత్వం పాలనలో సమూల మార్పులు తీసుకువచ్చామని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చామని, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చామని ప్రభుత్వం చెబుతోంది. రైతులు, మహిళలు, యువత కోసం అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తోన్నట్లు చెప్పుకొచ్చింది. తెలంగాణ చరిత్రలో ఓ నూతన అధ్యాయాన్ని లిఖించామని స్పష్టం చేస్తోంది. దీనికి భిన్నంగా స్పందిస్తోంది.. బీజేపీ రాష్ట్రశాఖ. రేవంత్ రెడ్డి 1,000 రోజుల పాలన మొత్తం దోపిడీపూరకమంటూ ఆరోపణలు గుప్పిస్తోంది. అధికార పార్టీ నాయకులు వందల




కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడ్డారని విమర్శిస్తోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ధ్వజమెత్తుతోంది. దీనిపై నిరసన కార్యక్రమాలను చేపట్టింది కూడా. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లే ప్రయత్నాలకు తెర తీసింది. ఈ క్రమంలో.. నగరం అంతటా బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన పోస్టర్లను అతికించాయి. హైదరాబాద్ వ్యాప్తంగా అత్యంత రద్దీగా ఉండే దాదాపు 500కు పైగా ప్రాంతాలలో ఈ పోస్టర్లు కనిపించాయి. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గాంధీ భవన్ పరిసరాల్లో ఈ పోస్టర్లను అంటించారు బీజేపీ నాయకులు. అసెంబ్లీ, రవీంద్ర భారతి, లక్డీకాపుల్ బస్ స్టాప్, ముఖ్యమంత్రి అధికారిక నివాసం వెలుపల పోస్టర్లు రాత్రికి రాత్రే వెలిశాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు అరుదైన ఘనత..: దేశంలోనే పలు ప్రధాన రహదారులు, జంక్షన్లు, రద్దీగా ఉండే బస్ స్టాండ్లు, మెట్రో రైలు పిల్లర్ల వద్ద కూడా స్థానిక బీజేపీ శ్రేణులు ఈ నిరసన పోస్టర్లను ప్రదర్శించాయి. దీంతో హైదరాబాద్ లో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. రెండు పార్టీల మధ్య ఘర్షణపూరిత వాతావరణానికి దారితీసింది. కాంగ్రెస్ ఇచ్చిన కీలక గ్యారెంటీల అమలుపై నిరసన తెలపడమే తమ ప్రధాన లక్ష్యమని బీజేపీ నాయకులు స్పష్టం చేస్తోన్నారు. 2026 ప్రజల పక్షాన ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడతామని బీజేపీ స్పష్టం చేసింది. ఈ పోస్టర్ల వివాదంపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా అంతే ఘాటుగా స్పందిస్తున్నారు. బీజేపీ నిరసనలను చౌకబారు రాజకీయ ప్రచారంగా కొట్టిపారేస్తోన్నారు. తాము అమలు చేస్తోన్న పథకాలను చూసి ఓర్వలేకనే బీజేపీ, బీఆర్ఎస్.. ఇలాంటి నిరాధారమైన ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు.

## డిఫెన్స్ ఎక్స్‌పో ప్రారంభానికి రాజ్‌నాథ్‌ను ఆహ్వానించిన సీఎం రేవంత్



ఢిల్లీ, సెప్టెంబర్ 02: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరుకావాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో – 2026ను ప్రారంభించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం రక్షణ శాఖ మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వీరు చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ప్రతిష్టాత్మక ఎయిర్ షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.దేశవ్యాప్తంగా రక్షణ రంగంలోని పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే రక్షణ ఎక్స్‌పోకు హాజరై మార్గనిర్దేశం చేస్తే, వారికి ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే రక్షణ ఎక్స్‌పో – 2026కు స్వాగతం పలికేందుకు తమ ప్రభుత్వం ఎదురుచూస్తోందని అన్నారు.రక్షణ ఎక్స్‌పో–2026ను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని రాజ్‌నాథ్ సింగ్‌కు తెలంగాణ సీఎం విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ఈ ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని ఆయనను కోరారు. స్టాటిక్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రదర్శనకు కూడా సహకరించాలన్నారు. భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ప్రదర్శనలో ఏర్పాటు చేయాలని, త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కోరారు.హెచ్‌ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు రక్షణ ఎక్స్‌పోలో విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు.ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాలు భూసేకరణ చేపట్టిందని రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. రక్షణ శాఖ మొత్తం1,500 ఎకరాలు కోరిందని.. మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు.మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇప్పటికే టీజీఐఐసీ అంగీకరించిందని రక్షణ శాఖ మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. ఎకరానికి కాకుండా మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో 33 సంవత్సరాలకు ఈ భూమిని కేటాయించనున్నట్లు వివరించారు. అవసరమైతే దానిని మరో రెండుసార్లు లీజు పొడిగించుకునే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.

## వ్యవస్థలన్నింటినీ రేవంత్ రెడ్డి కుప్పకూల్చారు..

### కాంగ్రెస్ వెయ్యి రోజుల దగాపై హరీశ్‌రావు ధ్వజం




హైదరాబాద్ , కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. కేసీఆర్ కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యిలా రాష్ట్రాన్ని ఇస్తే.. రేవంత్ రెడ్డి వ్యవస్థలన్నింటినీ కుప్పకూల్చారని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో కలిసి మాజీ మంత్రి, శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు తెలంగాణ భవన్‌లో 'ఛార్జ్ షీట్'ను విడుదల చేశారు. పదేళ్ల పాటు కేసీఆర్ ఎంతో కష్టపడి దేశానికే తలమానికంగా తీర్చిదిద్దిన తెలంగాణ రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా కుప్పకూలుస్తోందని, ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు.రాజకీయాంశాలు తెలుసుకోవడంఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆధ్వర్యంలో ఈరోజు కాంగ్రెస్ వైఫల్యాలపై 'ఛార్జ్ షీట్' విడుదల చేశామని తెలిపారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో జరిగిన అరాచకాలు, వ్యవస్థల నిర్వీర్యం, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ ఘోర వైఫల్యాలను ఎండగడుతూ ఈ ఛార్జ్ షీట్‌ను ప్రజల ముందు ఉంచుతున్నామని పేర్కొన్నారు.ఆరు గ్యారంటీల పేరుతో బాండు పేపర్లు రాసిచ్చి, వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రజలను నమ్మబలికిన కాంగ్రెస్.. వెయ్యి రోజులు గడుస్తున్నా ఆ హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ ఒక కొత్త రాష్ట్రాన్ని తన అపార అనుభవంతో, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎంతో కష్టపడి అద్భుతంగా నిర్మించారని తెలిపారు. అనేక కార్యక్రమాలతో దేశం నేర్చుకునే విధంగా తొమ్మిదిన్నర ఏళ్లు గొప్ప పాలనను అందించారన్నారు. అది తాగునీటి రంగం కావచ్చు, సాగునీటి రంగం కావచ్చు.. ఏ రంగం చూసినా తెలంగాణను దేశానికే ఆదర్శంగా, తలమానికంగా కేసీఆర్ తయారు చేశారని అన్నారు. వ్యవసాయంలో అత్యధిక వరి ధాన్యం పండించిన రాష్ట్రంగా తెలంగాణను అగ్రగామిగా నిలిపారని కొనియాడారు.కానీ, రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అద్భుతమైన వ్యవస్థలన్నీ ఒక్కొక్కటిగా కుప్పకూలిపోతున్నాయని హరీశ్‌రావు అన్నారు. విద్యా వ్యవస్థ, వైద్య వ్యవస్థ, విద్యుత్, తాగునీరు, శాంతిభద్రతలు.. ఇలా ప్రతీ వ్యవస్థా కుప్పకూలిందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఉంటే.. ఈరోజు రేవంత్ రెడ్డి పాలనలో కరెంట్ కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దయనీయ పరిస్థితి చూస్తున్నామని అన్నారు.దేశంలోనే అగ్రగామిగా నిలిచిన వైద్య రంగం.. నేడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం మందులు కూడా దొరకని దీన స్థితికి దిగజారిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యి లాగా రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పజెబితే.. దాన్ని మరింత అద్భుతంగా ముందుకు తీసుకెళ్లాల్సింది పోయి, పూర్తిగా నాశనం చేసి కుప్పకూల్చారని అన్నారు. పురోగమనం వైపు వేగంగా ప్రయాణం చేయాల్సిన రాష్ట్రం.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనంతో తిరోగమనం వైపు పయనిస్తోందని అన్నారు.ఆరు గ్యారంటీల అమలులో ఈ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాల వల్ల అన్ని శాఖల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. వ్యవస్థలను కాపాడాలని, ఆరు గ్యారంటీలు అమలు కావాలని, ప్రజల కష్టాలు తొలగిపోవాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఏడు రోజుల నిరసన కార్యక్రమాలను ప్రకటించిందని తెలిపారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి మా ఈ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ఏదీ లేదు: సింగరేణి యాజమాన్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 02: సంస్థకు చెందిన భూగర్భ గనులను ప్రైవేటీకరించే ప్రతిపాదన ఏదీ లేదని సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. సింగరేణి భూగర్భ గనుల ప్రైవేటీకరణ అంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. సంస్థకు చెందిన భూగర్భ గనుల ప్రైవేటీకరణ అంటూ జరుగుతున్న ప్రచారాన్ని బుధవారం యాజమాన్యం ఖండించింది. ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని వివరించింది. సంస్థ నష్టాల్లో ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రత కోసం భూగర్భ గనులను కొనసాగిస్తామని పేర్కొంది.గనులు మూసివేయడం, ప్రైవేటు పరం చేయడం తమ లక్ష్యం కాదని సింగరేణి యాజమాన్యం ఈ సందర్భంగా కుండబద్దలు కొట్టింది. ఉత్పత్తి పెంచి, నిర్వహణ వ్యయాలు తగ్గించి గనులను లాభాల్లోకి తీసుకురావడమే ఈ సంస్థ ముఖ్య లక్ష్యమని యాజమాన్యం వెల్లడించింది. మంచిర్యాల జిల్లా మందమర్రిలోని శాంతిఖని గనిపై కేవలం పైలట్ అధ్యయనం కోసమేనని వివరించింది.మైన్ డెవలప్‌మెంట్ అండ్ ఆపరేషన్ (ఎండీఓ ) విధానంతో ఖర్చులు, నష్టాలు తగ్గుతాయా? అనే అంశంపై అధ్యయనం చేస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. శాంతిఖని ఈఓఐ ఆధారంగా ప్రైవేటీకరణ ప్రచారం వాస్తవ విరుద్ధమని పేర్కొంది.

## కాళేశ్వరంలో కుట్ర జరిగితే అప్పుడెందుకు కేసు పెట్టలేదు: కడియం శ్రీహరి

జనగామ, సెప్టెంబర్ 2 : బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో, అహంకారంతో మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి (తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందని ఆరోపించారు లింగాల గణపురంలో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని మాట్లాడారు. బీజేపీ నేతలు సర్వేల్లో, పోటీల్లో వెనుకబడుతున్నారని రెచ్చిపోయి ఏది పడితే అది మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ద్వారానే



సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోని పదేళ్లు తెలంగాణ మీద పడి లక్షల కోట్లు దోచుకున్నారని.. స్వయంగా కేసీఆర్ కూతురు కవిత చెప్పిందని ప్రస్తావించారు.దోచుకున్న సొత్తును లెక్కపెట్టేందుకు వారికి సమయం సరిపోవడం లేదని కవిత చెప్పారని కడియం శ్రీహరి అన్నారు. ఎక్కడో పంపకాల్లో తేడా రావడంతో ఇప్పుడు ఆమె బయటకు వచ్చి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నాయకులకు సిగ్గు ఉంటే తమ మీద విమర్శలు, వ్యతిరేకంగా నిరసనలు చేయడం కాదని.. కవిత లేవనెత్తిన అంశాలకు సమాధానం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరంలోని ప్రధాన మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు అప్పుడే కుంగిపోయాయని చెప్పుకొచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కుట్ర జరిగిందనే అనుమానం ఉంటే అప్పుడెందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు.కాళేశ్వరం నుంచి చుక్క నీటిని ఉపయోగించకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో అత్యధిక పంట దిగుబడి సాధించిందని కడియం శ్రీహరి తెలిపారు. కేసీఆర్ అధికారాన్ని అడ్డం పెట్టుకొని విచ్చలవిడిగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని ధ్వజమెత్తారు.

## సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలి: మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, సెప్టెంబర్ 2: కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో ఢిల్లీకి వెళ్లిన మంత్రి కొండా సురేఖ.. పలువురు పార్టీ పెద్దలతో భేటీ అవుతున్నారు. ఇందులో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సురేఖ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశానని.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని అన్నారు. అధిష్ఠానం ఏం చేస్తుందో వేచిచూస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేయాలని తనను కోరలేదని చెప్పారు.బీసీ అయిన తనకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయం పాటిస్తారా అని కొండా సురేఖ ప్రశ్నించారు. కేబినెట్‌లో ఉన్న ఇతర సామాజికవర్గాల నేతలపై పెద్దఎత్తున అనేక ఆరోపణలు ఉన్నాయన్నారు. వాటన్నింటికీ ఏం సమాధానం చెబుతారని.. ఎలాంటి చర్యలు తీసుకుంటారని అడిగారు. అన్ని అంశాలపై ఇప్పటికే ఖర్గే, రాహుల్, ప్రియాంక సహా అధిష్ఠాన పెద్దలందరికీ రాతపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌పై అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదేళ్లు తానే సీఎం అని రేవంత్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. అన్ని విషయాలనూ పరిగణనలోకి తీసుకోవాలని ఖర్గేకు చెప్పినట్లు మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## దిశా సాలియన్ మృతి కేసు..

### సీబీఐ దర్యాప్తునకు బాంబే హైకోర్టు ఆదేశం..

దివంగత బాలీవుడ్ స్టార్ హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ మృతి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాంబే హైకోర్టు సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. దిశపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేశారని ఆరోపిస్తూ ఆమె తండ్రి సతీష్ సాలియన్ గత సంవత్సరం బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఆ పిటిషన్‌పై జస్టిస్ సారంగ్ కోత్వాల్, జస్టిస్ రంజీత్‌సిన్హా రాజా భోసలేలతో కూడిన ధర్మాసనం ఆగస్టు 28వ తేదీన విచారణను ముగించి, తీర్పును రిజర్వ్ చేసింది. సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ బుధవారం తీర్పును వెలువరించింది. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, సతీష్ సాలియన్ స్టేట్‌మెంట్ రికార్డు చేయాలని ఆదేశించింది.

ఇయ్యాల తెలంగాణ
మన భాష – మన యాస

# సంపాదకీయం

## పెళ్లి పెటాకులు ఎందుకు అవుతున్నాయి..

మనదేశంలో వివాహేతర సంబంధాలు పెట్టుకుంటున్న వారి సంఖ్య అధికంగానే ఉంది. ప్రతిరోజూ వార్తల్లో అక్రమ సంబంధాల కోసం భర్తలను చంపేస్తున్న భార్యల గురించి వింటూనే ఉన్నాము. ఎందుకిలా జీవితాలు నాశనం చేసుకుంటున్నారని తిట్టుకుంటూ ఉంటాము. అయితే దీని వెనక అనేక సామాజిక, మానసిక, ఆర్థిక కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఒక వయసు దాటాక ఆ వ్యక్తులు ఎదుర్కొనే పరిస్థితులు, మారుతున్న జీవనశైలి.. అన్నీ కలిపి వారిని అక్రమ సంబంధాల వైపు ఆకర్షితులయ్యేలా చేస్తాయని చెబుతున్నారు. పెళ్లయిన తర్వాత జీవితాంతం ఒక్క జీవిత భాగస్వామితోనే ఉండాలన్నది భారతీయ సాంప్రదాయం. కానీ పెళ్లైన పదేళ్ల తర్వాత ఎక్కువ మంది తమ భాగస్వాములను మోసం చేస్తున్నారు. పురుషులు మాత్రమే కాదు మహిళలు కూడా ఇలాంటి పనులు అధికంగానే చేస్తున్నారు. ముఖ్యంగా 35 నుంచి 40 ఏళ్ల లోపు ఉన్న మహిళలు అక్రమ సంబంధాల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుంది? దీనికి కారణాలేంటో కూడా వివరిస్తున్నారు నిపుణులు.ఆ మధ్య మియాపూర్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి ట్యాంక్ బండ్ మీద నుంచి దూకేసి ఆత్మహత్య చేసుకున్నాడు. దీని వెనక ఒక బలమైన కారణం ఉంది. అతని భార్య ఇష్టానుసారంగా తిరిగేది. అనేక మందితో వివాహేతర సంబంధం పెట్టుకునేది. ఈ విషయం అతడికి తెలుసు. వివాహం జరిగి.. పిల్లలు ఉండడంతో భార్య చేసిన తప్పులను అతను క్షమించాడు. చివరికి ఆమె తన ప్రియుళ్ళను ఇంటికి తీసుకురావడం మొదలుపెట్టింది. వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు వీడియోలు షూట్ చేయించుకుని.. వాటిని చూస్తూ ఆనందించేది. అయితే ఆ వీడియోలు బయటికి రావడంతో ఆమె భర్త ఆత్మహత్య చేసుకున్నాడు.కేవలం ఇది అతని స్టోరీ మాత్రమే కాదు. సమాజంలో చాలామంది మగాళ్ల పరిస్థితి ఇప్పుడు ఇలానే మారిపోయింది. ఓ టీవీ ఇంటర్వ్యూలో ఓ మహిళ మానసిక విశ్లేషకురాలు సంచలన విషయాలను వెల్లడించారు. ఒకప్పుడు మగవాళ్ళు వివాహేతర సంబంధాలు పెట్టుకునేవారని.. ఆ సంబంధాలను వారు స్టేటస్ సింబల్ లాగా భావించే వారిని.. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయిందని.. మగవాళ్ళ స్థానంలోకి ఆడవాళ్లు వచ్చేసారని ఆమె చెప్పేసింది. తన వద్దకు వచ్చే వారిలో ఎక్కువ శాతం కేసులు ఇవే ఉన్నాయని ఆమె చెప్పడం ఆందోళన కలిగిస్తోంది.పైగా నేటి కాలంలో 90% భర్తలు ఇలానే ఉన్నారని.. తమ భార్యలు వివాహేతర సంబంధాలు పెట్టుకున్నప్పటికీ సర్దుకొని ఊరుకుంటున్నారని ఆమె చెప్పుకొచ్చింది. అప్పటికే పెళ్లి కావడం.. పిల్లలు కూడా పుట్టడంతో.. భార్య ఎన్ని తప్పులు చేసిన సరే భర్తలు నిశ్శబ్దంగా ఉండిపోతున్నారని.. పిల్లల కోసం అన్నింటినీ త్యాగం చేస్తున్నారని ఆ మహిళ మానసిక విశ్లేషకురాలు వాపోయింది. భార్యలు ఎన్ని తప్పులు చేసినా సరే భర్తలు నిశ్శబ్దంగా ఉండి పోవడం వల్ల.. కొంతమంది రెచ్చిపోతున్నారని.. విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారని ఆ మహిళ మానసిక విశ్లేషకురాలు చెప్పుకొచ్చింది. ఇష్టానుసారంగా తిరిగే మహిళలు కౌన్సిలింగ్ ద్వారా కూడా మారే అవకాశం లేదని ఆ మహిళ విశ్లేషకురాలు వాపోయింది. మరో వైపు పురుషుల శృంగార సామర్థ్యంపై నిర్వహించిన ఓ తాజా సర్వేలో విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పురుషుల్లో సగం మంది అంగస్తంభన సమస్యలతో బాధపడుతున్నారట. 50 ఏళ్ల లోపు ఉన్న పురుషుల్లో 50 శాతం మంది ఈ సమస్యతో సెక్స్‌ను ఎంజాయ్ చేయలేకపోతున్నారని తేలింది. లండన్‌లోని కింగ్స్ కాలేజీ పరిశోధకులు నిర్వహించిన సర్వేలో.. పురుషుల లైంగిక సామర్థ్యం రోజు రోజుకు తగ్గిపోతోందని వెల్లడైంది. వాళ్లు నిర్వహించిన సర్వేలో బ్రెజిల్‌లోని పురుషుల్లో 40 ఏళ్లలోపు వాళ్లలో.. 35.6 శాతం మంది 18-25 వయస్కులు అంగస్తంభన సమస్యతో మదనపడుతున్నారు. 30.7 శాతం మంది 26-40 ఏళ్ల వయస్కులు ఈ సమస్యతో మానసికంగా కుంగిపోతున్నారు.రోజూవారీ జీవితంపై పడిన ప్రభావమే.. ఈ సమస్యకు కారణమని, ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి వల్ల దీని బారిన పడుతున్నారని తేలింది. హృద్రోగ సమస్యలు, మతిమరుపు, అకాల మరణం లాంటివి కూడా ఏర్పడుతున్నాయని పరిశోధకులు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 2025 నాటికి 322 మిలియన్ల పురుషులు అంగస్తంభన సమస్యను ఎదుర్కొంటారని వెల్లడించారు. 1995లో ఆ సంఖ్య 152 మిలియన్లుగా ఉండేది. యూకేలో 11.7 మిలియన్ల మంది ఈ సమస్యతో బాధపడుతున్నారని, ప్రతి 8 మందిలో ఒకరు బాధితులేనని పేర్కొన్నారు.లైఫ్ స్టైల్ మార్చుకుంటే ఈ సమస్య నుంచి గట్టెక్కవచ్చని తెలిపారు. బరువు తగ్గడం, ధూమపానానికి దూరంగా ఉండటం, ఆరోగ్యకర ఆహారం తినడం, ప్రతి రోజూ వ్యాయామం చేయడం వల్ల అంగస్తంభన సమస్యలను దూరం చేసుకోవచ్చని వివరించారు.ఇటువంటి మనసు కలిగి ఉన్నవాళు పిల్లల్ని కూడా సరిగా పెంచలేరని.. పిల్లలపై కూడా ఆ ప్రభావం పడుతుందని ఆ మహిళ విశ్లేషకురాలు వివరించింది. ఇటువంటి వాళ్లను సాధ్యమైనంతవరకు మార్చేందుకు భర్తలు ప్రయత్నించాలని.. లేనిపక్షంలో దూరంగా ఉండటమే మంచిదని ఆమె చెప్పుకొచ్చారు. తమ సంబంధాలకు అడ్డుపడే వారిని ఏదైనా చేసే మనస్తత్వం ఇటువంటి మహిళల్లో ఉంటుందని.. అటువంటి మహిళలకు గట్టి గుణపాఠం చెబితేనే బాగుంటుందని ఆ మహిళా విశ్లేషకురాలు చెప్పింది. ఆమె మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది.దంపతుల్లో చాలామందికి ఇతరులతో తమ జీవిత భాగస్వామిని పోల్చి చూసుకునే బలహీనత ఉంటుంది. తాను ఆశించినట్టు భర్త లేడనో, సంసార సుఖం విషయాన్ని పట్టించుకోవడం లేదనో అసంతృప్తికి లోనవుతుంటారు. ఈ అసంతృప్తిలో వివాహేతర సంబంధాల ఉచ్చులో పడుతుంటారు.

# నందమూరి హరికృష్ణ జయంతి సందర్భంగా ఘన నివాళులు.

ఇయ్యాల తెలంగాణ / చంద్రాయణ గుట్ట నందమూరి హరికృష్ణ జయంతి సందర్భంగా హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని లాల్‌దర్వాజా మోడ్ వద్ద తెలుగుదేశం పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నాగు నగేష్ ముఖ్య అతిథి గా విచ్చేసి నందమూరి హరికృష్ణ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాగు నగేష్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన మహానేత నందమూరి తారక రామారావు గారి పిలుపుతో చైతన్య రథసారథిగా నందమూరి హరికృష్ణ చేసిన ప్రజా సేవ, పార్టీ కోసం చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. రాష్ట్రం నలుమూలలా చైతన్య రథంతో పర్యటిస్తూ



తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో హరికృష్ణ కీలక పాత్ర పోషించారని తెలిపారు. అనంతరం ఆయన రాజకీయాల్లోకి వచ్చి ప్రజా ప్రతినిధిగా, రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో సామాన్య ప్రజలు, మహిళల సంక్షేమం కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని నాగు నగేష్ గుర్తుచేశారు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్ ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, బస్సుల్లో మహిళలకు సీటు కేటాయింపులో ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.అలాగే రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఉపయోగించే ట్రాక్టర్లపై పన్ను భారం తగ్గించే/ మినహాయించే చర్యలు తీసుకోవడం ద్వారా రైతులకు అండగా నిలిచారని అన్నారు. రైతు సంక్షేమం, సామాన్య ప్రజల ప్రయోజనాల కోసం హరికృష్ణ చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు.నందమూరి హరికృష్ణ గారు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ప్రజాసేవా స్ఫూర్తి, తెలుగుదేశం పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధత, తెలుగు ప్రజల పట్ల ఆయన చూపిన అభిమానం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని నాగు నగేష్ అన్నారు.ఈ కార్యక్రమంలో రామ్ నారాయణ్ యాదవ్, కె.డి. దినేష్, బి.వై. శ్రీకాంత్, జోగిందర్ సింగ్, సత్య కృష్ణ, అజయ్, వెంకట్ సాయి వరుణ్, అరుణేష్,గాలి మురళీ,నితీష్,రాములు, కె.వెంకటేష్ తదితరులు పాల్గొని నందమూరి హరికృష్ణ గారికి ఘనంగా నివాళులు అర్పించారు.

# ఓటర్లు సమర్పిస్తున్న ధృవ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం చూపాలి : తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ, హైదర్ షా కోట్, శివరాంపల్లి ఓటరు కేంద్రాల ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి. రాజేంద్రనగర్ ఇయ్యాల తెలంగాణ:అందిన నోటీసులకు సరైన పత్రాలు చూపే ఓటర్ల పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. బుధవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ, హైదర్ షా కోట్, శివరాంపల్లిలో ఏర్పాటు చేసిన ఓటరు జాబితా సవరణల నమోదు బస్తీ సభలను ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు. సిబ్బంది అందిన నోటీసుల ప్రతిపాదనలను పరిశీలిస్తున్న పనితీరును అడిగి తెలుసుకున్నారు. మ్యాపింగ్ కానీ ఓటర్లతో పాటు తప్పులు ఉన్న ఓటర్లకు నోటీసులు అందుతున్నాయా లేదా అని అధికారులను ప్రశ్నించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఏ ఏ ధ్రువ పత్రాలను సమర్పిస్తున్నారో ... అవి సరైనవా? కావా అని చూసుకొని జాగ్రత్తగా పరిశీలించి జాబితాలో పేరు నమోదు చేయుడానికి దృవీకరించాల్సిన బాధ్యత స్థానిక ఎన్యూమరేషన్ సిబ్బంది ఉందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి పలువురు ఓటర్ల తో స్వయంగా మాట్లాడారు. ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అభ్యంతరాలు ఉన్న ప్రతి ఓటర్ కు నోటీసులు



అందజేసి సరైన ధృవ పత్రాలను తీసుకోవాలన్నారు. బస్తీ సభలలో అధికారులు ఓటర్లతో హియరింగ్ చేస్తున్న విధానాలను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డి ప్రత్యేకంగా పరిశీలించారు. ప్రధాన ఎన్నికల అధికారి వెంట రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎన్నికల అధికారి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రనగర్, అత్తాపూర్ ఏఈఆర్ఓబి.సురేందర్ రెడ్డి, మల్లయ్య తదితరులు ఉన్నారు.

# డిసెంబర్ లో కార్పొరేషన్ ఎన్నికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)తెలంగాణలో రెండో దశ మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. డిసెంబర్‌లో జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతో పాటు ఇతర వాయిదా పడిన పురపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. జీహెచ్ఎంసీని హైదరాబాద్, మల్కాజిగిరి, సైబరాబాద్‌గా పునర్వ్యవస్థీకరించడం, 'సర్' ప్రక్రియ కారణంగా ఎన్నికల ప్రక్రియ ఆలస్యమైంది. అక్టోబర్ 19 తర్వాత షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు, పరిపాలన సౌలభ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకోనున్నారు.తెలంగాణలో రెండో దశ మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. డిసెంబరు నెలలో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లతో పాటు ఎన్నికలు వాయిదా పడిన ఇతర పురపాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో పురపాలక శాఖ అధికారులు ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. అయితే అప్పటికి జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల పదవీకాలం పూర్తికాకపోవడంతో వాటికి ఎన్నికలు నిర్వహించలేదు. కొన్ని ప్రత్యేక కారణాలతో మందమర్రి, మణుగూరు, అచ్చంపేట, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు జరగలేదు.జీహెచ్ఎంసీ పదవీకాలం ఫిబ్రవరి 10తో ముగిసిన అనంతరం ప్రభుత్వం దానిని మూడు కార్పొరేషన్లుగా పునర్వ్యవస్థీకరించింది. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాలను కలుపుతూ మల్కాజిగిరి, సైబరాబాద్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఈ పునర్వ్యవస్థీకరణ కారణంగా ఎన్నికల ప్రక్రియ ఆలస్యమైనట్లు తెలుస్తోంది.ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతుండటంతో అధికారులు దానిపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. అక్టోబర్ 19 నాటికి ఆ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉండటంతో, ఆ తర్వాత కొంత సమయం తీసుకుని డిసెంబరులో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. వాతావరణ పరిస్థితులు, పరిపాలనా సన్నద్ధత, ప్రజలకు ఇబ్బందులు తగ్గించే అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఎన్నికల షెడ్యూల్‌పై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఎలివేటెడ్ కారిడార్లకు బ్రేక్..

హైదరాబాద్, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)హైదరాబాద్ నగరం నుంచి ఉత్తర తెలంగాణ జిల్లాల వైపు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు భూసేకరణ సమస్య అడ్డంకిగా మారింది. సర్కార్ నిర్ణయించిన గడువులోగా పనులు పూర్తి చేయాలంటే ఇప్పటికే నిర్మాణ పనులు వేగం పుంజుకోవాల్సి ఉండగా.. డిఫెన్స్, ప్రైవేటు భూములు పూర్తిస్థాయిలో హెచ్ఎండీఏకు అందకపోవడంతో పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు.సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి ఎన్‌హెచ్-44లోని డెయిరీఫాం వైపు 5.40 కిలోమీటర్ల మేర ఒక ఎలివేటెడ్ కారిడార్, ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ వైపు 18.5 కిలోమీటర్ల మేర మరో కారిడార్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఉత్తర తెలంగాణ వైపు వెళ్లే ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని కుదించడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యం. అయితే రెండు కారిడార్లకూ రక్షణశాఖతో పాటు ప్రైవేటు భూములు అవసరం కావడంతో భూసేకరణ, అప్పగింత ప్రక్రియ కీలకంగా మారింది.ప్యారడైజ్?ఎన్‌హెచ్-44 డెయిరీఫాం కారిడార్ మొత్తం 5.40 కిలోమీటర్లలో 3.20 కిలోమీటర్ల మేర రక్షణశాఖ భూములపై నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందులో సుమారు రెండు కిలోమీటర్ల మేర భూమిని రక్షణశాఖ హెచ్ఎండీఏకు అప్పగించింది. దీంతో ఆ ప్రాంతంలో పనులు క్రమంగా వేగం పుంజుకుంటున్నాయి. ఇంకా సుమారు ఒక కిలోమీటర్ పరిధిలో రక్షణ భూముల అప్పగింత పూర్తి కావాల్సి ఉంది. ఈ కారిడార్‌లో మరో 1.6 కిలోమీటర్ల పరిధిలో ప్రైవేటు భూములు అవసరం ఉంది. భూముల సమీకరణ ప్రక్రియ పూర్తయినప్పటికీ అవార్డు పాస్ చేయాల్సిన ప్రక్రియ మిగిలి ఉంది. మరోవైపు రక్షణశాఖ భూముల్లో రక్షణ గోడల నిర్మాణం చేపడుతున్నారు. దీంతో కారిడార్ పనులు దశలవారీగా ముందుకు సాగుతున్నాయి.ప్యారడైజ్ శామీర్‌పేట్ ఎలివేటెడ్ కారిడార్ విషయంలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంది.

# కాంగ్రెస్ వైఫల్యాలపై ఉద్యమ నాయకుని సమరభేరి




ఇయ్యాల తెలంగాణ /చంద్రాయన గుట్ట కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఃఖీ పార్టీ మెంబర్షిప్ ఇంచార్జ్ షాయిన్ అఫ్రోజ్ ఆధ్వర్యంలో చంద్రాయన గుట్ట నియోజకవర్గంలో బి ఆర్ఎస్ ఉద్యమ నాయకుడు ఆకుల శ్రీనివాస్ గాంధీ విగ్రహానికి పూలమాల సమర్పించిన అనంతరం రాస్తారోకో నిర్వహించి ధర్నా కార్యక్రమం చేపట్టారు తదనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ 1000 రోజుల పాలనలో ఉచిత బస్సు తప్ప కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఏ వి అమలు కాలేదని,ఐఅఖీ హామీలను తుంగలో తొక్కుతూ, ప్రజలను మభ్యపెట్టి ఎన్నాళ్లు బతుకుతావు అంటూ మండిపడ్డారు. కళ్యాణ లక్ష్మి కనుమరుగయిపాయే, షాదీ ముబారక్ లేకనే పాయే, ఇంట్లో ఉన్న ఆడవాళ్లకు అందరికీ పింఛన్ ఎటుబాయే, చదువుకునే యువతకు స్కూటర్ ఎ టువాయే, నడివయసు వారికి ఆసరా పింఛను కనిపించకుండా పాయే, మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆగమాగం ఆయ అంటూ శ్రీనివాస్ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా షాహిన్ అఫ్రోజ్ చంద్రాయన గుట్ట మెంబర్షిప్ ఇంచార్జ్, సిహెచ్ సరిత కంటెస్టెడ్ కార్పొరేటర్, ఫిరోజ్ ఖాన్, షేక్ మొహమ్మద్ ఫజల్, మహమ్మద్ నదీమ్, షేక్ ఇర్ఫాన్, సుల్తాన్ మీర్జా, దాల్ భాయ్, వినోద్, దశరథ, ఇర్ఫాన్, మోసా భాయ్, రాజశేఖర్, గౌస్, నాగమణి, రజిత, శివాని, అశ్విని,అధిక సంఖ్యలోబి ఆర్ఎస్ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మాదన్నపేట అంబేద్కర్ విగ్రహం దగ్గర బీజేపీ ఎస్సీ మోర్చా నిరసన ర్యాలీ



ఇయ్యాల తెలంగాణ/ మాదన్నపేట తెలంగాణ బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయం పై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా, విషయాన్ని తీవ్రంగా ఖండిస్తూ భాగ్యనగర్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కౌడి సురేంద్ర ఆధ్వర్యంలో అంబేద్కర్ మరియు బాబు జగ్జీవన్ రావ్ చిత్రపటాలకు పూలమాల వేసిన అనంతరం కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. కౌడి సురేందర్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి సాక్ష్యం అని, ఇలాంటి సంఘటనలు చూస్తూ ఊరుకోమని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, సహదేవ్ యాదవ్, యాకుత్పురా ఇన్చార్జ్ వీరేంద్రయాదవ్, ఎస్సీ మోర్చా నాయకులు రాజేష్, మోహన్ కృష్ణ, వసంత, మహిళా మోర్చా నాయకులు దశరదలక్ష్మి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు,డివిజన్ నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.





ఇయ్యాల తెలంగాణ: బ్రాహ్మణ వాడి శివాలయం లో సామూహిక పసుపు బొట్టు కార్యక్రమాన్ని ముత్యాల ప్రేమరాజ్ గరుడు నరేష్ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ చెరుకుల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పటాయా చేరుకున్న అమెరికా యుద్ధనౌక.. వ్యభిచారం అనుమానంతో 50 మంది అరెస్టు



బ్యాంకాక్: అమెరికా యుద్ధ నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ థాయ్‌ల్యాండ్‌లోని పటాయాకు చేరుకున్నది. సుమారు 5 వేల మంది సిబ్బందితో ఆ యుద్ధనౌక.. పశ్చిమాసియా తీరం నుంచి తిరుగుముఖం పట్టిన విషయం తెలిసిందే. దాదాపు 250 రోజులుగా రికార్డు స్థాయిలో యుద్ధనౌక అబ్రహం లింకన్ సముద్రంలోనే ఉన్నది. దీంతో ఆ యుద్ధనౌకలో పనిచేస్తున్న సిబ్బంది తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ఇరాన్‌పై యుద్ధంలో పాల్గొన్న తర్వాత ఇటీవలే యుద్ధనౌక లింకన్ వెనుదిరుగుతోంది.ప్రస్తుతం పటాయా బీచ్ రిసార్టు సమీపంలో ఆ నౌకను డాకింగ్ చేశారు. నైట్‌లైఫ్, సెక్స్ టూరిజంకు కేంద్రమైన పటాయాలో యుద్ధనౌకను డాక్ చేయడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నది. సిటీలోని బార్లు, రెస్టారెంట్లు ఇప్పుడు బిజీ కానున్నాయి. గతంలో వియత్నాం వార్ సమయంలోనూ సేద తీరేందుకు ఇక్కడకు అమెరికా దళాలు వచ్చినట్లు తెలిసింది. అమెరికా సైనికులు భారీ సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో పటాయాలో వేశ్యల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నట్లు థాయ్ పోలీసులు అంచనా వేస్తున్నారు.లాయిమ్ చాబాంగ్ వద్ద యుద్ధనౌకను నిలిపారు. సైనికుల రాక సందర్భంగా సిటీలో పెట్రోలింగ్‌ను పెంచేశారు. బీచ్‌ఫ్రంట్, నైట్‌లైఫ్ ఏరియాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. వీకెండ్ తనిఖీల్లో సుమారు 50 మంది వేశ్యలను అదుపులోకి తీసుకున్నారు. టూరిస్టుల సంఖ్య పెరగడం వల్ల సిటీలో వ్యభిచారాన్ని అదుపు చేయడం కష్టమే అవుతుందని పటాయా పోలీసు చీఫ్ ఆనెక్ స్రాతోంగ్యూ తెలిపారు. పబ్లిక్ స్థలాల్లో కస్టమర్ల కోసం సెక్స్ వర్కర్లు ఎదురుచూసే అవకాశాలు పెరుగుతాయన్నారు.


## భారత్‌ను హిందూ దేశంగా ప్రకటించాలి.. సాధ్వి రితంబర సంచలన వ్యాఖ్యలు..!



: భారత్ సాంస్కృతిక విలువలు, సంప్రదాయాలు, జీవన విధానం పరంగా ఇప్పటికే హిందూ దేశంగా ఉందని పద్మభూషణ్ అవార్డు గ్రహీత సాధ్వి రితంభర అన్నారు. రాజకీయంగానూ భారత్‌ను హిందూ దేశంగా ప్రకటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పూరీలో బుధవారం శ్రీ జగన్నాథుడిని దర్శించుకున్న అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పూరీలోని బాలియాపండాలోని సెవెన్ హిల్స్‌లో ఏడు రోజులపాటు భాగవత కథ నిర్వహించేందుకు సాధ్వి రితంభర వచ్చారు. ఈ సందర్భంగా 'హిందూ రాష్ట్రం' డిమాండ్‌పై జరుగుతున్న రాజకీయ చర్చపై ఆమె స్పందించారు. భారతదేశ మెజారిటీ ప్రజల ఆలోచనల్లో 'వసుధైవ కుటుంబకం' భావన ఉందన్నారు. ప్రపంచమంతా ఒకే కుటుంబమనే ఈ సిద్ధాంతాన్ని రాజకీయ పార్టీలు ప్రపంచానికి పరిచయం చేయాలని చెప్పారు. సనాతన ధర్మంలోని ప్రాథమిక సిద్ధాంతాలను ప్రోత్సహించడం ద్వారా 'వసుధైవ కుటుంబకం' సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించవచ్చని సాధ్వి రితంభర అన్నారు. భారతీయ సంప్రదాయాలు, ఆచారాలు, సామూహిక చైతన్యంలో హిందూ దేశ భావన ఇప్పటికే ఉందని చెప్పారు. భారత రాజ్యాంగంలో శ్రీరామచంద్రుడి ప్రస్తావన నుంచి 'సత్యమేవ జయతే' వరకు దేశ సాంస్కృతిక భావజాలం కనిపిస్తోందని ఆమె అన్నారు. హిందువుల సంక్షేమమే భారత సంక్షేమమని వ్యాఖ్యానించారు. భావాలు, ప్రవర్తన, జీవన విధానం పరంగా భారత్ హిందూ దేశంగానే ఉందని, రాజకీయంగా కూడా హిందూ దేశంగా ప్రకటించాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. ఆవుల సంరక్షణపైనా ఆమె మాట్లాడారు. గోవధ, మహిళలపై హింస, గర్భంలోని ఆడ శిశువుల హత్య జరిగే చోట శాంతి, సంతోషం ఉండవని అన్నారు. ప్రభుత్వాలు ఇతర మార్గాల్లో ఆదాయం పొందవచ్చని, గోమాంసం విక్రయాల ద్వారా ఆదాయం పొందడం తీవ్రమైన పాపమని వ్యాఖ్యానించారు. శ్రీ జగన్నాథుడి దర్శనం తనకు ఎంతో భావోద్వేగ అనుభూతిని ఇచ్చిందని సాధ్వి రితంభర తెలిపారు. పూరీ సమన్వయానికి ప్రతీకగా నిలిచే పవిత్ర క్షేత్రమని ఆమె పేర్కొన్నారు.

## లబ్ధిదారులకు మండలి ఛైర్మన్ గుత్తా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నల్లగొండ, సెప్టెంబర్ 02ర : అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేట్ హాస్పిటల్స్ లో చికిత్స పొందిన 101 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిది ద్వారా మంజూరు అయిన రూ. 82,25,800/- (ఎనభై రెండు లక్షల ఇరవైదు వేల ఎనిమిది వందలు) విలువ గల చెక్కులను నేడు



నల్లగొండలోని క్యాంప్ కార్యాలయంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సీఎం సహాయ నిధి వరం వంటిదన్నారు. అర్హులు సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు.. ఉప్పొంగుతున్న నదులు..!



హిమాలయ దేశం నేపాల్ ను భారీ వర్షాలు వరదలు ముంచెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో పలు ప్రధాన నదులు ఉధృతంగా ప్రవహిస్తూ ప్రమాదకరస్థాయికి చేరువయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారులు దేశంలోని మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీచేశారు. ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.నేపాల్ హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ విభాగం ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటలప్పటికి మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టాలు హెచ్చరిక స్థాయిని దాటాయి. సింధులి జిల్లాలోని సన్ కోశీ నది, గూర్ఖా జిల్లాలోని బుధి గండకి నది, దడెల్ధురా జిల్లాలోని మహాకాళి నదుల్లో నీటి ప్రవాహం ఆందోళనకరంగా ఉంది. ఈ నదుల్లో నీటిమట్టం మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు లమ్‌జంగ్ జిల్లాలోని మర్స్యంగ్ది నదిలో ప్రవాహం ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటింది.నిన్న రాత్రి 11:15 గంటలకు భుకుందెబెసి వాటర్ లెవెల్ మానిటరింగ్ కేంద్రం వద్ద ఈ నది ప్రమాద స్థాయిని దాటినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ నదిలో నీటిమట్టం ఇంకా పెరుగుతూనే ఉందని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ పేర్కొన్నది. దాంతో నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు ఎక్కువగా ఉందని హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రజలకు కీలక సూచనలు చేసింది.ముఖ్యంగా మర్స్యంగ్ది నది దిగువ ప్రాంతాల ప్రజలు వెంటనే అప్రమత్తం కావాలని కోరింది. నదీ తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం రాజధాని ఖాట్మండు సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున, ప్రజలు అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

## ప్రజా వ్యతిరేక పాలనపై భగ్గుమన్న బీఆర్ఎస్ మిర్యాలగూడ శ్రేణులు

మిర్యాలగూడ, సెప్టెంబర్ 02 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంలో వైఫల్యం చెందిందని పేర్కొంటూ, ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలో 420 హామీలతో కూడిన ఫ్లెక్సీని ర్యాలీగా తీసుకువచ్చి ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకు నెలకు రూ. 2,500 అందిస్తామని ఇప్పటివరకు రూ. 82,500 బాకీ పడిందన్నారు. వృద్ధాప్య పింఛనుదారులకు నెలకు రూ. 4000 ఇస్తానని చెప్పిందని 33 నెలలకు రూ. 66 వేలు బాకీ ఉందని అదేవిధంగా దివ్యాంగులకు రూ. 6000 పింఛన్ ఇస్తామని చెప్పగా రూ. 66,000 బాకీ పడిందని తెలిపారు.



కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చి నేడు పట్టించుకోకుండా వదిలేశారని ఆరోపించారు. 18 సంవత్సరాలు దాటిన విద్యార్థినిలు స్కూటీ బాకీ ఉందని ఇంతవరకు ఇవ్వలేదని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల రూ. 12 వేల కోట్లు బాకీ పడ్డారని దీనివలన కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కళాశాల యాజమాన్యాల నుండి వేధింపులు వస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులు అరిగోస పడుతున్నారని, విత్తనాలు, ఎరువులు దొరకక గోస తీస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఎరువులు దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యూరియా బుకింగ్ యాప్ వలన రైతులు బ్లాకులో యూరియాను కొనాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. రెండు లక్షల రుణమాఫీ 50 శాతం మందికి కాలేదని అన్నారు రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తానని హామీని గాలికి వదిలేశారని తెలిపారు విద్యా భరోసా కార్డు కింద విద్యార్థులకు ఐదు లక్షల రూపాయలు బాకీ పడ్డారన్నారు.ప్రపంచ పటాలు పరిశీలించండిఅదేవిధంగా ఆటో కార్మికులకు రూ. 12,000 హామీ ఇచ్చారని ఇప్పటికి రూ. 24 వేలు బాకీ పడ్డారని తెలిపారు. హామీల అమలులో వైఫల్యం చెందిన రేవంత్ రెడ్డి సీఎం పదవి నుండి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనకు మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా రెండు వేల మందికి పైగా కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు చింతారెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్న భీమోజు నాగార్జున చారి, నల్లమోతు సిద్ధార్థ, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, పాలుట్ల బాబయ్య, మట్టపల్లి సైదులు యాదవ్, హతీరామ్, ఎడవల్లి శ్రీనివాస్ రెడ్డి, సిర్ర మల్లయ్య యాదవ్, కట్ట మల్లేష్ గౌడ్, శాహనాంజ్ బేగం, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## 200 ఏళ్ల తర్వాత ఆడబిడ్డ.. రథంలో ఘనంగా ఇంటికి తీసుకొచ్చిన కుటుంబం

మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఓ కుటుంబానికి సుమారు 200 ఏళ్ల తర్వాత ఆడబిడ్డ జన్మించడంతో సంబరాలు అంబరాన్నంటాయి. నాలుగు తరాల తర్వాత తమ కుటుంబంలోకి ఆడపిల్ల అడుగుపెట్టడంతో దహిఫాలే కుటుంబ సభ్యులు చిన్నారికి ఘన స్వాగతం పలికారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన గార్గి అనే నవజాత శిశువును ఆమె తల్లితో కలిసి ప్రత్యేకంగా అలంకరించిన భారీ రథంలో ఇంటికి తీసుకువచ్చారు. డప్పులు, తాళాల మోత, పాటలు, నృత్యాలతో సాగిన ఈ రథయాత్ర స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షించింది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు ఆనందోత్సాహాలతో చిన్నారిని స్వాగతించారు. గార్గి పుట్టుకతో కుటుంబంలో చాలా కాలంగా ఉన్న



ఆడపిల్ల లోటు తీరిందని ఆమె తాత లింబాజీ దహిఫాలే భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గార్గి పుట్టుకతో కుటుంబంలో చాలా కాలంగా ఉన్న ఆడపిల్ల లేని లోటు తీరింది. మా కుటుంబంలోకి కుమార్తె రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాం. ఇన్నేళ్లుగా ఆడపిల్ల లేదనే బాధ ఉండేదని, ఇప్పుడు ఆ లోటు తీరింది. నా ఇద్దరు కోడళ్లను కూడా సొంత కూతుళ్లలా చూసుకున్నాను. ఇప్పుడు నా మనవరాలిని సంగీతం, నృత్యాల మధ్య రథంలో ఇంటికి తీసుకురావడం జీవితంలో మరచిపోలేని రోజు' అని అన్నారు. చిన్నారి గార్గి తండ్రి మాట్లాడుతూ.. 'చాలామంది కొడుకు కావాలని కోరుకుంటారు. కూతురు పుట్టినప్పుడు కలిగే అనుభూతి మాటల్లో చెప్పలేను. నా కూతురిని పువ్వులా.. అపురూపంగా పెంచుకుంటా' అని అన్నారు. మరోవైపు ఆడపిల్ల పుట్టిన సందర్భాన్ని వేడుకగా నిర్వహించిన దహిఫాలే కుటుంబాన్ని సామాజిక కార్యకర్త అనంత్ ఇంగ్లే అభినందించారు. సమాజంలోని కొన్ని వర్గాల్లో ఇప్పటికీ ఆడపిల్లల జననంపై ప్రతికూల ఆలోచనలు ఉన్నాయని, అలాంటి సమయంలో గార్గి రాకను కుటుంబ సభ్యులు సంబరంగా జరుపుకోవడం ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

## సంఘర్షణ జరిగిన మూడేళ్ల తర్వాత.. మణిపూర్ అసెంబ్లీకి కుకీ ఎమ్మెల్యేలు



ఇంఫాల్: మణిపూర్‌లో మైతీ, కుకీ తెగల మధ్య సంఘర్షణ జరిగిన మూడేళ్ల తర్వాత కుకీ ఎమ్మెల్యేలు తొలిసారి స్వయంగా అసెంబ్లీకి హాజరయ్యారు. ముఖ్యమంత్రి యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ వారి నిర్ణయాన్ని స్వాగతించారు. రాష్ట్రంలో ఐక్యత, శాంతిని పెంపొందించే దిశగా ఇది ఒక సానుకూల అడుగు అని అన్నారు. మణిపూర్ 12వ శాసనసభ 8వ సమావేశాలు బుధవారం ఇంఫాల్‌లో ప్రారంభమయ్యాయి. తెగల మధ్య సంఘర్షణ నేపథ్యంలో మూడేళ్లకు పైగా విరామం తర్వాత కుకీ సామాజిక వర్గానికి చెందిన శాసనసభ్యులు అసెంబ్లీకి స్వయంగా రావడం ముఖ్య పరిణామంగా నిలిచింది. సైతు శాసనసభ నియోజకవర్గం ఎమ్మెల్యే హాఖోలెట్ కిప్జెన్, సైకుల్ శాసనసభ నియోజకవర్గం ఎమ్మెల్యే కిమ్నియో హావోకిప్ హాంగ్‌షింగ్ స్వయంగా సభకు హాజరయ్యారు. చాలా కాలం తర్వాత తిరిగి అసెంబ్లీకి హాజరుకావడం సంతోషంగా ఉందని హాఖోలెట్ కిప్జెన్ అన్నారు. కాగా, కుకీ సామాజిక వర్గానికి చెందిన మణిపూర్ ఉప ముఖ్యమంత్రి నెమ్చా కిప్జెన్ వర్చువల్‌గా సమావేశాలకు హాజరయ్యారు. గత మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశానికి ఆరుగురు కుకీ శాసనసభ్యులు వర్చువల్‌గా పాల్గొన్నారు. అయితే ఈసారి సమావేశాలకు ఇద్దరు కుకీ ఎమ్మెల్యేలు స్వయంగా అసెంబ్లీకి హాజరుకావడం విశేషం. మరోవైపు కుకీ ఎమ్మెల్యేలు స్వయంగా అసెంబ్లీకి హాజరుకావడాన్ని ముఖ్యమంత్రి యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ స్వాగతించారు. రాష్ట్రంలో ఐక్యత, శాంతిని పెంపొందించే దిశగా ఇది ఒక సానుకూల అడుగు అని అన్నారు. సమిష్టి కృషితో మణిపూర్ శాంతి మార్గంలో పయనాన్ని కొనసాగిస్తుందని ఆయన ఆకాక్షించారు. మణిపూర్ అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబర్ 7 వరకు కొనసాగనున్నాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి హైకోర్టులో మరో ఎదురుదెబ్బ



కాంగ్రెస్ ప్రభుత్వానికి హైకోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ పేరిట ప్రభుత్వం హిమాయత్‌సాగర్‌లోని తమ భూములను తీసుకోవడాన్ని సవాల్ చేస్తూ బాధితులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డీపీఆర్ లేకుండా భూసేకరణ ఎలా చేస్తారంటూ పిటిషనర్ల తరపు న్యాయవాదులు కె. వివేక్ రెడ్డి, కె. ప్రతీక్ రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇరు పక్షాల వాదనలు విన్న ఉన్నత న్యాస్థానం తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పిటిషనర్ల భూములని స్వాధీన పరుచుకోవొద్దని వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## 'జీవితం పరుగుపందెం కాదు'.. ఐఐటీ గౌహతి విద్యార్థులకు సీఎం కీలక సందేశం

ఐఐటీ గౌహతికి చెందిన 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించాలని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను, ఐఐటీ గౌహతి డైరెక్టర్‌ను ఆయన ఆదేశించారు. సెప్టెంబరు 1న జరిగిన ఐఐటీ గౌహతి 33వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఐటీ గౌహతి కేవలం విద్యలో ప్రతిభ చూపించే సంస్థ మాత్రమే కాదని, అసోం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. ఐఐటీ గౌహతి విద్యార్థుల కోసం అసోం ప్రభుత్వం 100 స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని త్వరగా అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సంబంధిత అధికారులను, ఐఐటీ గౌహతి డైరెక్టర్‌ను కోరారు. అసోం ఎదుర్కొనే సంక్లిష్టమైన సాంకేతిక, అభివృద్ధి సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో ఐఐటీ గౌహతి కీలక పాత్ర పోషిస్తుందని హిమంత బిశ్వ శర్మ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగానే ఐఐటీ గౌహతి విద్యార్థులకు సీఎం ప్రత్యేక సందేశాన్ని కూడా ఇచ్చారు. 'జీవితం పరుగుపందెం కాదు.. మీరు అందరికంటే వేగంగా ముందుకు వెళ్లకపోయినా పర్వాలేదు. దాని వల్ల మీరు వెనుకబడినట్లు భావించాల్సిన అవసరం లేదు' అని సీఎం హిమంత బిశ్వ శర్మ సూచించారు.



ఇయ్యాల తెలంగాణ

గురువారం, 03-09-2026

# కవిత ఆ వర్గాన్ని టార్గెట్ చేస్తున్నారా




హైదరాబాద్, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్) తెలంగాణా రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వైఖరి ఆమె రాజకీయ ధోరణి ప్రత్యర్ధులను ఎంచుకునే విధానం అదే సమయంలో ఆమె చేస్తున్న విమర్శలు చర్చనీయాంశం అవుతున్నాయి. ఆమె తన సొంత కష్టాలను జనంలో పెడుతూ కన్నీరు పెడుతున్నారు. ఆమె తనను బీఆర్ఎస్ ఎందుకు సస్పెండ్ చేసింది అని ప్రశ్నిస్తున్నారు. తండ్రి కేసీఆర్ కి తనకు మధ్య చిచ్చు పెట్టారంటూ కొందరు నేతల మీద విమర్శలు చేస్తున్నారు. ప్రత్యేకించి రెడ్లను ఆమె టార్గెట్ చేస్తున్నారు అని అంటున్నారు. ఆమె ఎందుకు ఈ విధానాన్ని ఎంచుకున్నారు అన్నదే ఇపుడు సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. సోషల్ మీడియా కోసమా : ఇదిలా ఉంటే కల్వకుంట్ల కవిత సోషల్ మీడియాలో ప్రచారం కోసం మాట్లాడుతున్నారు అన్న చర్చ సాగుతోంది. ఆమె ఏమి మాట్లాడాలనుకుంటున్నారు, ఏమి మాట్లాడుతున్నారు అన్నది అర్థం కావడం లేదని అంటున్నారు. ఆమె మాటలు ఆమె చేస్తున్న వ్యాఖ్యల మీద బయట ఇదే డిస్కషన్ అవుతోంది. కవిత ఎంపీగా చేశారు, ఎమ్మెల్సీగా చేశారు, కానీ ఆమె చేస్తున్న విమర్శలు కానీ రాజకీయ వ్యాఖ్యానాలు కానీ పరిణితి లేకుండానే చేస్తున్నారా అన్న చర్చ కూడా సాగుతోంది. ఆమె ఏ రోజు ఎవరిని టార్గెట్ చేస్తారో కూడా అర్థం కావడం లేదని అంటున్నారు. ఒక రోజు ఆమె హరీష్ రావు మీద ఘాటు అయిన విమర్శలు చేస్తారు. ఆ మరుసటి రోజు హరీష్ రావుని క్షమిస్తాను అంటారు, ఆ వెంటనే మరో నేత మీద మండిపడతారు, ఇలా ఆమె చేస్తున్న విమర్శలకు విలువ ఉంటుందా అన్న చర్చ సాగుతోంది. ఇక కవిత హరీష్ రావుని తిడుతూ ఒక రోజు స్టేట్మెంట్ ఇస్తారు, ఆ మరుసటి రోజే సంతోష్ రావుని ఘాటుగా విమర్శిస్తారు. వీళ్లే నన్ను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించారు అని ఆమె అంటారు, ఇదంతా సోషల్ మీడియాలో మైలేజ్ కోసం ఆమె ఇలా మాట్లాడుతున్నారు అని అంటున్నారు. అయినా సరే ఆమె అనుకున్న మైలేజ్ రావడం లేదని కూడా వినిపిస్తోంది. తాజాగా ఆమె నిజామాబాద్ మీటింగులో మాట్లాడుతూ తాను హరీష్ రావుని సంతోష్ రావుని క్షమిస్తానేమో కానీ ప్రశాంత్ రెడ్డిని అసలు క్షమించను అంటూ హాట్ కామెంట్స్ చేశారు. దీంతో ఆమె బాధ ఏమిటో ఎవరికి అర్థం కావడం లేదని అంటున్నారు. కవిత మాట్లాడుతున్నది చూస్తే ఫక్తు ఫ్యామిలీ పంచాయతీగానే ఉంది. ఆమె బీఆర్ఎస్ నుంచి ఆ మధ్యన సస్పెండ్ అయ్యారు. ఈ రోజుకీ ఆమె అదే మాట మాట్లాడుతున్నారు. ఇదంతా జనంలో సానుభూతి కోసమే అని అంటున్నారు. అయితే అది రాకపోవడంతో ఆమె ఎవరెవరినో ముందు పెట్టి విమర్శలు చేస్తున్నారు. నిజానికి బీఆర్ఎస్ కేసీఆర్ ది. దాని వ్యవహారాలు మొత్తం చూస్తోంది కేటీఆర్. మరి ఒకరు తండ్రి అయితే మరొకరు అన్నయ్య, ఇలా సాగే ఫ్యామిలీ పంచాయతీలో ప్రశాంత్ రెడ్డికి కానీ మరొకరికి కానీ ఏమి సంబంధం ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ కి ఎవరైనా కవిత గురించి చాడీలు చెబితే వింటారా, ఆయన ఎంతటి సీనియర్ నాయకుడో అందరికీ తెలుసు కదా అంటున్నారు. పైగా కుమార్తె గురించి తండ్రికి చెప్పే పరిస్థితి ఉంటుందా అని అంటున్నారు. తనను పార్టీ నుంచి బయటకు పంపాలన్నా ఉంచాలన్నా కేసీఆర్ కి కేటీఆర్ కే సర్వాధికారాలు ఉంటాయని ఆమెకు తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. కానీ వారిని వదిలేసి వేరే వాళ్లను అంటే లాభమేంటి అన్న ప్రశ్నలు వస్తున్నాయి. రెడ్లను దూరం చేసుకుంటే : తెలంగాణా రాజకీయాల్లో రెడ్లు బలమైన శక్తిగా ఉన్నారు. నిజానికి బీఆర్ ఎస్ రెండు సార్లు అధికారంలోకి రావడానికి రెడ్లు కూడా ప్రధాన కారణం అని చెబుతారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కి పార్టీ పరంగానే ఓటు బ్యాంక్ ఉంది కానీ సొంతంగా సామాజిక వర్గం ఓట్లు ఎంత అన్న చర్చ వస్తోంది. అలాంటిది రెడ్ల మీద విరుచుకుపడితే కవిత కొత్త పార్టీకి కూడా లాభమేంటి అని అంటున్నారు. అయినా సరే కవిత ప్రతీ జిల్లా తిరుగుతూ అక్కడ రెడ్డి నాయకుల మీద నోరు పారేసుకుంటున్నారు అని అంటున్నారు. ఆమె ఈ మధ్యనే నల్గొండ జిల్లాకు వెళ్లి జగదీశ్వర రెడ్డిని అంటే ఆయన లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చేశారు అని అంటున్నారు. ఆ తర్వాత ఆమె నుంచి నో కామెంట్ అన్నట్లుగా ఫుల్ సైలెంట్ అయిపోయారని చెబుతున్నారు. ఇక మహబూబ్ నగర్ జిల్లాకు వెళ్ళి మరో రెడ్డి ఆయనను అంటే ఆయన కూడా ఘాటుగానే కౌంటర్ ఇచ్చేశారు. రాజకీయం చేయడం అంటే : ఇపుడు నిజామాబాద్ వెళ్ళి ప్రశాంత్ రెడ్డిని టార్గెట్ చేస్తున్నారు అని అంటున్నారు. నిజానికి కవిత తన పార్టీ బీసీల కోసం అని చెప్పుకుని తిరుగుతున్నారు కానీ బీసీలతో ఆమెకు సంబంధం ఏంటని బీసీ సంఘాలే ప్రశ్నిస్తున్నారు. రాజకీయం చేయడం అంటే ఇది కాదు కదా అని కూడా అంటున్నారు. తమ పార్టీ విధానాలు చెప్పుకోవాలి, నిర్మాణాత్మక విమర్శలు చేయాలి, అధికార పార్టీ తప్పులు ఉంటే ఎత్తి చూపాలి కానీ తమ కుటుంబ పంచాయతీలు జనంలో ఎత్తుకుని కన్నీరు పెట్టినా లేక ఒక సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసినా నష్టం తప్ప లాభం ఏమి ఉంటుందని అంటున్నారు. మొత్తానికి కవిత రాజకీయం అంతా సోషల్ మీడియాలో హైప్ కోసం అన్నట్లుగానే ఉందని కామెంట్స్ వస్తున్నాయి.

# బడా వినాయకుళ్లకు భారీ ధరలు



హైదరాబాద్, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్) వినాయక చవితి పండగ సమీపిస్తుండటంతో భాగ్యనగరంలో గణేష్ ఉత్సవాల సందడి అప్పుడే మొదలైంది. హైదరాబాద్ నగరంలతో పాటు శివారు ప్రాంతాల్లో విగ్రహాల తయారీ పనులు తుదిమెరుగులకు చేరుకున్నాయి. అయితే ఈ ఏడాది గణనాథుని విగ్రహాల ధరలు భారీగా పెరగనుండటంతో భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు ధరల భారం తప్పేలా లేదు. గతేడాదితో పోలిస్తే ఈసారి విగ్రహాల రేట్లు దాదాపు 25 శాతం వరకు పెరిగినట్లు తయారీదారులు స్పష్టం చేస్తున్నారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ , కొబ్బరిపీచు, రంగులు, అలంకరణ సామాగ్రి ధరలు విపరీతంగా పెరగడమే కాకుండా రవాణా ఛార్జీలు కూడా భారంగా మారాయని తయారీదారులు వెల్లడించారు. గతేడాది 20 అడుగుల విగ్రహం ధర రూ.85 వేలు ఉండగా, ఈసారి అది రూ.లక్ష దాటింది. అలాగే సాధారణంగా ఎక్కువ మంది కొనుగోలు చేసే 12 నుండి 16 అడుగుల విగ్రహాల ధరలు గతంలో రూ.50-60 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.70 నుండి 80 వేల వరకు పలుకుతున్నాయి.వార్తల సబ్‌స్క్రిప్షన్ పొందండినగరంలో వినాయక విగ్రహాల తయారీ అనగానే మొదట గుర్తుకొచ్చే ధూల్‌పేట్‌తో పాటు నాగోలు, ఎల్బీనగర్, ఉప్పల్, కూకట్‌పల్లి, మియాపూర్, ఘట్‌కేసర్ వంటి ప్రాంతాల్లోనూ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ధూల్‌పేట్ విగ్రహాలకు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా వంటి ఇతర రాష్ట్రాల్లో కూడా విశేషమైన డిమాండ్ ఉంది. ఇటీవల ఇతర రాష్ట్రాల నుంచి కూడా విగ్రహాలను దిగుమతి చేసుకుని విక్రయిస్తుండటంతో మార్కెట్‌లో పోటీ బాగా పెరిగింది.భక్తుల మదిని దోచేలా వివిధ భంగిమలు, చక్కటి వర్ణాలతో విగ్రహాలను కళాకారులు సిద్ధం చేశారు. విగ్రహాల బరువు తగ్గించడానికి, మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ఫైబర్ పదార్థాలను వినియోగిస్తున్నారు. డిజైన్లు, ఫైబర్ హంగులు, అలంకరణల ప్రాతిపదికన 20 నుండి 30 అడుగుల భారీ విగ్రహాల ధరలు రూ.లక్ష నుండి రూ.1.50 లక్షల వరకు పలుకుతున్నాయని ధూల్‌పేట్ నిపుణులు తెలిపారు.

# అధికారులు..మేమే లోకల్...

హైదరాబాద్, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమం సందర్భంగా అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అలిగి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ముఖ్య అతిథి అయిన దానం రాకుండానే అధికారులు లక్కీ డ్రా నిర్వహించడంతో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ క్రమంలోనే ఆ వ్యవహారంపై మీడియా సమావేశం ఏర్పాటు చేసిన దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాత బస్తీ ఎమ్మెల్యేల లాగా అధికారులపై దాడి చేస్తేనే వారు మాట వింటారు అంటే అలా చేయడానికి రెడీ అని ఆయన షాకింగ్ కామెంట్స్ చేశారు.అంతేకాదు, ప్రభుత్వ అధికారులను కొట్టడం తనకు కొత్తేమీ కాదని, అది తనకు అలవాటేనని ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. గతంలో ఒక ప్రభుత్వ అధికారిని కొట్టి జైలుకు కూడా పోయానని మీడియా ముందే ఆయన వ్యాఖ్యానించడం విశేషం. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని, లబ్ధిదారుల జాబితాలో తన నియోజకవర్గం వారు కాకుండా బయటివారు ఉన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇక, హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్ తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆయన అన్నారు. ఆయన వ్యవహారంపై సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తానని, అసెంబ్లీలో కూడా ఈ వ్యవహారం గురించి ప్రస్తావిస్తానని చెప్పారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా అధికారులు ప్రొటోకాల్ పాటించాలని అన్నారు.అధికారులు వస్తుంటారు పోతుంటారు?దానం నాగేందర్ లోకల్ అంటూ ఇడియట్ లో రవితేజ మాదిరి డైలాగ్ చెప్పారు దానం. ప్రభుత్వంపై అసంతృప్తి లేదని, తన వ్యాఖ్యలను వక్రీకరించొద్దని స్పష్టం చేశారు. ఎక్కడో కుట్ర జరుగుతోందని, అధికారుల ప్రవర్తన బాగోలేదని, దాని వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని అన్నారు.'తెలంగాణ క్యాబినెట్ లో మంత్రులకు పూర్తి స్థాయి స్వేచ్ఛ లేదు. దీంతో పనులు జరగడం లేదు. మంత్రులకు వారి శాఖలపై పూర్తి స్థాయి అధికారం, హక్కులతో పనిచేసే కల్పించాలి. వారికి స్వేచ్ఛ ఇవ్వకుంటే కొత్త సమస్యలు తెర మీదకు వస్తాయి. వారికి డబ్బులు విడుదల చేసే హక్కు లేదు. దానికి వారు ఆర్థిక శాఖ చుట్టూ తిరుగుతున్నారు. నా నియోజకవర్గానికి నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు పనులను ఆమోదించినా ఆర్థిక శాఖ నిధులు విడుదల చేయడం లేదు' అని కొత్తగూడెం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రెండున్నరేళ్లుగా ఇదే సాగుతుందని, ఒక్క పని కూడా ముందుకు వెళ్లడం లేదని, నేను కాంగ్రెస్ మిత్రపక్షం సీపీఐ ఎమ్మెల్యేను కాబట్టి నేను ప్రభుత్వాన్ని బలంగా విమర్శించలేను. అలాగని మౌనంగాను ఉండలేను. మంత్రులు నా సౌమ్యతను తీసుకుని వ్యవహరిస్తున్నారు అని కూనంనేని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రులు పనులు వారి శాఖలకు సంబంధించిన పనులను ఆమోదించినా వాటికి ఆర్థికశాఖ నిధులు మంజూరు చేయక పోవడం మూలంగా పనులు ఆగిపోతున్నాయని ఆయన అంటున్నారు. 2023 శాసనసభ ఎన్నికల్లో సీపీఐ కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లింది. ఈ ఎన్నికల్లో కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నియోజకవర్గం నుండి పోటీ చేసి ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకట్రావు మీద 26 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు 37,555 ఓట్లు సాధించి మూడో స్థానానికి పరిమితం అయ్యాడు. కాంగ్రెస్ పార్టీతో పొత్తు మూలంగా మిత్రపక్షంగా ఉన్నప్పటికీ అభివృద్ధి నిధులు, రహదారులు, సింగరేణి ఉద్యోగాలు, భూ సమస్యలు, ఉద్యోగుల డీఏ, ఆర్టీసి వంటి అంశాలలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నారు. ప్రభుత్వానికి బయట నుండి మద్దతు ఇస్తూనే వివిధ సమస్యలపై పార్టీ పరంగా గళం ఎత్తుతూనే ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలోని వామపక్ష వాదులతో కలిసి పనిచేశారు. 1952లో దేశంలో సీపీఐ సాధారణ ఎన్నికల్లో రెండో అతిపెద్ద పార్టీగా నిలిచింది. 1964లో కమ్యూనిస్టులు సీపీఐ - సీపీఎంలుగా విడిపోయిన తర్వాత కాంగ్రెస్ పో కలిసి నడిచేందుకు సీపీఐ మొగ్గుచూపింది. 1980, 1985, 1994 ఎన్నికల్లో సీపీఐ టీడీపీతో పొత్తు పెట్టుకుంది. 2004లో సీపీఐ, సీపీఎంలు కాంగ్రెస్ పార్టీతో పొత్తుపెట్టుకుని 15 స్థానాల్లో గెలిచాయి. తెలంగాణ - ఆంధ్ర విడిపోయిన తర్వాత వామపక్షాలు రెండు రాష్ట్రాల్లో బలహీనపడ్డాయి. 2023 ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాలలో కొత్తగూడెం నుండి కూనంనేని ఒక్కరే సీపీఐ నుండి గెలవడం గమనార్హం.

# ఆయిల్ పామ్ కు డబుల్ బొనంజా



ఖమ్మం, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతుల పంట పండింది. ఆయిల్ పామ్ గెలల ధరలు మరోసారి రికార్డు స్థాయికి చేరాయి. టన్ను గెలల ధర రూ.24,025కు పెరిగింది. దేశంలో ఆయిల్ పామ్ సాగు చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ధర ఇదేనని అధికారులు తెలిపారు. దీంతో ఆయిల్ పామ్ రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జూలై నెలలో టన్ను గెలలకు రూ.23,783 ధర అమలులో ఉండగా.. ఆగస్టు చివరి నాటికి మరో రూ.242 పెరిగి రూ.24,025కు చేరింది. పెరిగిన ధరను ఆగస్టు నెలకు వర్తింపజేయనున్నట్లు టీజీ ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లలో పామాయిల్ ధరల కదలికలు, ఉత్పత్తి పరిస్థితులు తదితర అంశాల ప్రభావంతో గెలల ధరల్లో మార్పులు చోటుచేసుకుంటుంటాయని నిపుణులు చెబుతున్నారు.ఇక గెలల ధర పెరగడమే కాకుండా రైతులకు చెల్లింపుల విషయంలోనూ ఆయిల్‌ఫెడ్ కీలక మైలురాయిని చేరింది. ఆగస్టు నెలలో గతంలో ఎన్నడూ లేనంతగా సుమారు రూ.175 కోట్లను ఆయిల్ పామ్ రైతులకు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఒకే నెలలో ఇంత భారీ మొత్తాన్ని రైతులకు చెల్లించడం సంస్థ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఆయిల్ పామ్ పంటకు సాధారణ పంటలతో పోలిస్తే దీర్ఘకాలిక పెట్టుబడి, నిర్వహణ అవసరమైనప్పటికీ.. గెలల ధరలు మెరుగ్గా ఉంటే రైతులకు స్థిరమైన ఆదాయం లభించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రికార్డు ధర నమోదవడం వల్ల సాగు విస్తీర్ణం పెంచుకోవాలనుకునే రైతుల్లోనూ ఆసక్తి పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ రంగ నిపుణులు భావిస్తున్నారు.తెలంగాణలో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహక చర్యలు చేపడుతోంది. నీటి వసతి, నాట్లకు సంబంధించిన సహాయం, డ్రిప్ వంటి మౌలిక సదుపాయాలతో పాటు మార్కెటింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. పామాయిల్ దిగుమతులపై దేశం ఆధారపడటాన్ని తగ్గించడం, దేశీయంగా ఉత్పత్తిని పెంచడం కూడా ఆయిల్ పామ్ సాగు విస్తరణ వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా అధికారులు చెబుతున్నారు.ఆయిల్ పామ్ గెలలకు రికార్డు ధర లభించడం తమకు ఎంతో ఊరటనిస్తోందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగు ఖర్చులు, కూలీల వ్యయం, ఎరువులు, నీటి నిర్వహణ వంటి వ్యయాలు పెరుగుతున్న సమయంలో గెలలకు లభిస్తున్న మెరుగైన ధర ఆదాయాన్ని పెంచుతుందని చెబుతున్నారు. ధరలు ఇదే స్థాయిలో కొనసాగితే ఆయిల్ పామ్ సాగు మరింత ఆకర్షణీయంగా మారే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బీజేపీ పని షురూ...

హైదరాబాద్, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)తెలంగాణాకు చెందిన జి కిషన్ రెడ్డి సీనియర్ నాయకుడు. ఆయన విద్యార్థి రాజకీయాల నుంచి బీజేపీలో పనిచేశారు. ఏబీవీపీ నుంచి యువ మోర్చా దాకా అక్కడ నుంచి బీజేపీలో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉమ్మడి ఏపీలో పనిచేశారు. ఆయన ఎమ్మెల్యేగా అంబర్ పేట నుంచి మూడు సార్లు గెలిచారు. శాసన సభా పక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. ఇక గత రెండు పర్యాయాలుగా ఆయన ఎంపీగా గెలిచారు. సికింద్రాబాద్ నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తూ కేంద్రంలో మంత్రిగా ఏడేళ్ళుగా కొనసాగుతున్నారు. తెలంగాణా బీజేపీకి కూడా ఆయన 2023 ఎన్నికలకు ముందు మరోసారి వ్యవహరించారు. ఇంతటి సుదీర్ఘమైన రాజకీయ చరిత్ర ఉన్న కిషన్ రెడ్డిని బీజేపీ పార్టీ వ్యవహారాలకు పూర్తిగా వాడుకుంటుంది అన్న ప్రచారం సాగుతోంది. బీజేపీ కీలక మార్పులు చేయబోతోంది అని అంటున్నారు. తెలంగాణలో ఈసారి ఎలాగైనా అధికారం అందుకోవాలని బీజేపీ చూస్తోంది. ఈ నేపథ్యంలో త్వరలో చేపట్టబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో బీజేపీ ప్రాతినిధ్యం ఈ రాష్ట్రంలో రెట్టింపు చేయాలని ఆలోచిస్తోంది. ప్రస్తుతం రెండుగా ఉన్న కేంద్ర మంత్రి పదవులను నాలుగు చేయాలని బీజేపీ ఆలోచిస్తో అని అంటున్నారు. అంతే కాదు మహిళ బీసీ కోటాను కూడా అనుసరించి మరిద్దరికి కేంద్ర మంత్రి పదవులు ఇస్తారని అంటున్నారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణకు కేంద్ర మంత్రిగా చాన్స్ ఖాయమని అంటున్నారు. అలాగే మల్కాజ్ గిరీ ఎంపీ ఈటెల రాజేందర్ కి కేంద్ర మంత్రి పదవి తథ్యమని అంటున్నారు. వీరిద్దరితో పాటు కొందరి సేవలను పార్టీ కోసం వినియోగించుకోవాలని చూస్తోంది అని అంటున్నారు. ఇక కేంద్ర మంత్రిగా సీనియర్ నేతగా ఉన్న కిషన్ రెడ్డిని బీజేపీ పార్లమెంటరీ బోర్డులోకి తీసుకుంటారు అని అంటున్నారు. తెలంగాణా నుంచి దక్షిణాది నుంచి బీజేపీ ఫోకస్ పెంచేందుకు ఇది ఉపయోగపడుతుందని అంటున్నారు. బీజేపీకి పార్లమెంటరీ బోర్డు చాలా కీలకం అని చెబుతున్నారు. ఎవరికి ఎక్కడ టికెట్ ఇవ్వాలన్నా ఈ అత్యున్నత విధాయక మండలి నిర్ణయిస్తుంది. ప్రధాని సహా కీలక నేతలు అంతా ఉండే ఈ బోర్డులోకి కిషన్ రెడ్డిని తీసుకుంటారు అని అంటున్నారు. దాని ద్వారా రానున్న కాలంలో తెలంగాణా రాజకీయాన్ని మరింత క్లోజ్ గా మోనిటరింగ్ చేస్తారు అని అంటున్నారు. 2028లో జరిగే ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇవ్వాలి అన్నది కూడా ఇంకా బాగా అధ్యయనం చేసేందుకు ఇది దోహదపడుతుందని అంటున్నారు.

# మంత్రులు వీరేనా...

హైదరాబాద్, సెప్టెంబర్ 2, (న్యూస్ పల్స్)తెలంగాణ మంత్రివర్గంలో మార్పులు, విస్తరణపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు కీలక నేతలు దిల్లీలో అధిష్ఠానంతో చర్చలు జరుపుతున్నారు. కొండా సురేఖపై క్రమశిక్షణ చర్యలు, ఆమె స్థానం కొత్తవారికి అవకాశం, ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవుల భర్తీపై ప్రధానంగా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. లంబాడా, ఇతర బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. శాసనసభ సమావేశాల అనంతరం మంత్రివర్గ విస్తరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ మార్పులు, విస్తరణపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పార్టీకి చెందిన పలువురు కీలక నేతలు ఢిల్లీ బాట పట్టడంతో ఈ వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మంత్రి కొండా సురేఖ కూడా ఢిల్లీలో ఉన్నారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ కేంద్ర నాయకత్వంతో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా కొండా సురేఖ వ్యవహారం, ఒకరిద్దరు మంత్రుల పనితీరు, వ్యవహారశైలితో పాటు మంత్రివర్గంలో కొత్తగా ఎవరికి అవకాశం కల్పించాలనే అంశాలు చర్చకు వచ్చినట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్ గౌడ్‌లతోనూ పార్టీ అధిష్ఠానం చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రమే కేసీతో సమావేశమై ఇటీవల పరిణామాల గురించి చర్చించారు. ఈ నేపథ్యంలో సురేఖ, చిన్నారెడ్డిలపై సీరియస్ యాక్షన్ తప్పదనే అభిప్రాయం పార్టీ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. క్రమశిక్షణ కమిటీ సిఫార్సు మేరకు వారిద్దరిపైన చర్యలకు మాత్రమే పరిమితమవుతారా... పూర్తిస్థాయిలో మార్పులు చేర్పులు ఉంటాయా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పిస్తే ఆమె స్థానాన్ని భర్తీ చేసేది ఎవరు..? ఖాళీగా ఉన్న మరో రెండు మంత్రి పదవులను కూడా భర్తీ చేస్తారా..? ఇప్పటికే ఉన్న మంత్రుల్లో ఇంకా ఎవరినైనా తొలగిస్తారా అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖ స్థానంలో అదేవర్గానికి చెందినవారికి ఇవ్వాల్సి వస్తే ప్రస్తుతం విప్‌గా ఆది శ్రీనివాస్ పేరును పరిగణనలోకి తీసుకొనే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఖాళీగా ఉన్న రెండు మంత్రి స్థానాల్లో ఒకటి లంబాడా వర్గానికి కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరుతున్నట్లు తెలిసింది. ఆ వర్గం నుంచి బాలూనాయక్, రామచంద్రునాయక్ పోటీ పడుతున్నారు. మరో స్థానానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లాకు చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్లు ప్రచారంలో ఉన్నా.. ఇందులో సుదర్శన్ రెడ్డికి ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు సమాచారం. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం తనకు మంత్రి పదవి కావాలని పట్టుబడుతున్నారు. ఆయతే ఆయన సోదరుడు వెంకట్ రెడ్డి మంత్రివర్గంలో ఉన్న నేపథ్యంలో సోదరులిద్దరికీ చోటు కల్పించడానికి కాంగ్రెస్ అధిష్ఠానం సానుకూలంగా లేదనే ప్రచారం కూడా ఉంది. వారి విషయంలో అధిష్ఠానం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఇక స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా మంత్రి వర్గంలో స్థానం కోసం పోటీ పడుతున్నారు. ఆయన్ను మంత్రి వర్గంలోకి తీసుకుంటే ఇప్పటికే మంత్రిగా ఉన్న లక్ష్మణ్ కుమార్‌ను తప్పించి స్పీకర్ చేయవచ్చుననే ప్రచారం కూడా ఉంది.


ఇయ్యాల తెలంగాణ


# రోజూ ఒక టీస్పూన్ పొడి వాడితే చాలు - షుగర్ కంట్రోల్, గుండె సేఫ్..!!



మునగాకు పొడి. ఈ మధ్య కాలంలో ఎక్కువగా వినియోగం లోకి వచ్చింది. ఈ పొడి ఒక పవర్ హౌస్ గా పేర్కొంటారు. అనేక సమస్యలకు పరిష్కారంగా నిలుస్తోంది. మునగాకులో అనేక రకాల పోషకా లు ఉన్నాయి. మునగాకును ఎండబెట్టి పొడి చేసి కూడా తినవచ్చు. మునగాకు పొడిని రోజూ ఒక టీస్పూన్ మోతాదులో తినడం వల్ల ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. గుండె సంబంధిత సమస్యలతో పాటుగా షుగరు.. కొలెస్ట్రాల్ తో బాధపడుతున్న వారికి ఉపశమనం ఇస్తుందని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. మునగాకులో అనేక రకాల పోషకాలు ఉన్నాయి. మునగాకు పొడి అనేది ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ప్రకృతిసిద్ధమైన ఔషధం. మునగ ఆకు పొడిని వాడడం వల్ల చర్మంపై ముడతలు తగ్గిపోతాయి. దీంతో యవ్వనంగా కనిపి స్తారు. మునగాకుల పొడిలో కాస్త రోజ్ వాటర్ కలిపి నల్లని మచ్చలు, మొటిమలు ఉన్న చోట రాసి ఆ తరువాత తరువాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే ఆయా సమస్యలు తగ్గుతాయి. మునగాకుల్లో పోషకాలు మెండుగా ఉంటాయి. అందువల్ల ఈ పొడిని రోజూ తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగు తుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల నుంచి బయట పడవచ్చు. దగ్గు, జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. మునగాకుల్లో మెగ్నిషియం, ఐరన్ సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల రక్తం తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు. మునగాకుల్లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. జీర్ణవ్యవస్థను శుభ్రం చేస్తుంది. మధుమేహ బాధితులకు మేలు అదే విధంగా మధుమేహ బాధితులకు ఈ పొడి వరం లాంటిది. మునగ పొడి డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను ఎక్కువగా తగ్గిస్తుందని అధ్యయనాలు తేల్చాయి . మునగ పొడిలో ఎక్కువగా విటమిన్స్, ఫ్లేవనాయిడ్స్, ఆల్కలాయిడ్స్, ఇతర ముఖ్య బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా డయాబెటిస్, ఇన్సులిన్ నిరోధకత, నాన్ ఆల్కహాలిక్ లివర్ డిసీజ్, క్యాన్సర్, ఇన్‌ఫ్లమేషన్ వంటి సమస్యల్ని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. ఈ పొడితో కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గిపోతాయి. బీపీ అదుపు లోకి వస్తుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. చిన్నారులకు సైతం మునగా కు పొడిని ఇవ్వవచ్చు. మునగాకు పొడిని తినడం కూడా కష్టంగా ఉంటే దాన్ని ఏదైనా ఇతర పదా ర్థంతో కలిపి తినవచ్చని... లేదా రోజూ అన్నంలో మొదటి ముద్దలో తినవచ్చని సూచిస్తున్నారు. పరిమితి మేరకు వినియోగిస్తే మునగాకు తో ప్రయోజనాలు సొంతం అవుతాయని స్పష్టం చేస్తున్నారు.

# పనస పండు హల్వా ఇలా చేస్తే అదిరిపోతుంది!



సాధారణ స్వీట్స్ తిని విసిగిపోయినప్పుడు రకరకాల హల్వాలు చేసుకుని తింటాం. గుమ్మడికాయ హల్వా, క్యారెట్ హల్వా వంటివి మాత్రమే కాదు ఒకసారి పనస పండు హల్వా తిని చూడండి. ఈ హల్వా చూడటానికి మాత్రమే కాదు, తినడానికి కూడా చాలా రుచిగా ఉంటుంది. పనస పండు సీజన్‌లో ఈ పండుతో రుచికరమైన, ఆరోగ్యకరమైన హల్వా ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. ఎలా తయారు చెయ్యాలో ఒకసారి చూద్దాం. కావాల్సిన పదార్థాలు: పనస పండు గుజ్జు - 2 కప్పులు, తాటి బెల్లం లేదా సాధారణ బెల్లం- 1 కప్పు, నెయ్యి- 3 టేబుల్ స్పూన్లు , జీడిపప్పు- 15 బాదం పప్పు- 15 యాలుకల పొడి- కొద్దిగా తయారీ విధానం: ముందుగా పనస పండు తీసుకుని గింజలు తీసేసి చిన్న ముక్కలుగా కట్ చేయండి. మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోండి. సుమారు రెండు కప్పుల గుజ్జు తీసుకోవాలి.. కొన్ని చిన్న ముక్కలు పక్కన పెట్టుకోండి - హల్వాలో వేస్తే మరింత రుచి పెరుగుతుంది. కడాయిలో రెండు టేబుల్ స్పూన్ల నెయ్యి వేడి చేసి జీడిపప్పులు, బాదం పప్పు బంగారు రంగు వచ్చే వరకు వేయించి పక్కన పెట్టండి. ఇలా చేస్తే పనసపండు హల్వా సూపర్ టేస్ట్ అదే నెయ్యిలో పనస పండు గుజ్జు వేసి గట్టిపడే వరకు నిరంతరం కలుపుతూ ఉండండి. కాస్త గట్టిపడిన తర్వాత బెల్లం వేసి మళ్లీ బాగా కలపండి. చక్కెర కంటే బెల్లం వాడితే ఆరోగ్యానికి మంచిది. బెల్లం వేసిన తర్వాత బెల్లం కరిగి మళ్ళీ హల్వా లూజ్ గా అవుతుంది. దానిని కలుపుతూ గట్టిపడేవరకు ఉడికించండి. పాన్‌కు అంటుకోకుండా బాగా దగ్గరకు వచ్చేవరకు కలుపుతూ ఉండండి. ఆపై పక్కన పెట్టిన చిన్న పనస ముక్కలు వేసి కలపండి. నోట్లో వేసుకోగానే కరిగిపోయే రుచికరమైన పనస పండు హల్వా అందులో యాలుకల పొడి కూడా వేసి కలపండి. చివరగా వేయించిన జీడిపప్పులు, బాదం పప్పులు వేసి కలిపితే నోట్లో వేసుకోగానే కరిగిపోయే రుచికరమైన పనస పండు హల్వా రెడీ అవుతుంది. ఈ హల్వా పసిపిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ నచ్చుతుంది. సీజనల్ స్వీట్‌గా ఒక్కసారి దీనిని ట్రై చేసి చూడండి.

# రోజూ ఓ అరగంట సైకిల్ తొక్కండి చాలు..!!




నేటి ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ అనేది క్రమంగా తగ్గిపోతోంది. చాలామంది గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేయడం వల్ల ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు వంటి అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మన దైనందిన అలవాట్లలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా వాటన్నింటినీ నివారించుకోవచ్చు. అటువంటి అలవాట్లల్లో ఒకటి.. సైక్లింగ్. శరీరాన్ని ఫిట్‌గా, మెదడు చురుగ్గా, మనస్సును ప్రశాంతంగా ఉంచగల ఓ అద్భుతమైన వ్యాయామం ఇది. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ సులభంగా చేయగలిగే శారీరక వ్యాయామాలలో సైక్లింగ్ మొదటి స్థానంలో ఉంటుంది. జిమ్‌కు వెళ్లి బరువులు ఎత్తడం లేదా ట్రెడ్ మిల్ పై రన్నింగ్ వంటి కఠినమైన ఎక్సర్ సైజ్ లతో పోలిస్తే.. ఇది వయస్సు పైబడిన వారికీ ఎంతో ఉపయోగకరం. కీళ్లపై ఎలాంటి అదనపు ఒత్తిడిని కలిగించదు. అందువల్ల మోకాళ్ల నొప్పులు ఉన్నవారు కూడా డాక్టర్ల సలహాతో సైక్లింగ్ చేయవచ్చు. ప్రతిరోజూ ఓ అరగంట పాటు సైకిల్ తొక్కడం వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు రక్తప్రసరణ సాఫీగా సాగుతుంది. సైక్లింగ్ అనేది ఓ చక్కటి కార్డియో వాస్కులర్ వ్యాయామం. క్రమం తప్పకుండా సైక్లింగ్ చేయడం వల్ల గుండె పనితీరు మెరుగుపడటమే కాకుండా ఊపిరితిత్తుల సామర్థ్యం కూడా పెరుగుతుంది. రక్తనాళాల్లో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్ ను కరిగించి మంచి కొలెస్ట్రాల్ శాతాన్ని పెంచడంలో ఇది సహాయపడుతుంది. ఫలితంగా భవిష్యత్తులో గుండెపోటు, పక్షవాతం వంటి అనారోగ్య సమస్యల ముప్పు గణనీయంగా తగ్గుతుంది. తక్కువ కాలంలో ఆరోగ్యకర పద్ధతిలో బరువు తగ్గాలనుకునే వారికి సైక్లింగ్ ఒక వరం లాంటిది. మనం సైకిల్ తొక్కే వేగం, సమయం ఆధారంగా ఇది గంటకు 400 నుండి ఏకంగా 1000 క్యాలరీల వరకు బర్న్ చేయగలదు. శరీరంలో మెటబాలిజం రేటును పెంచడంతో పాటు పొట్ట భాగంలో పేరుకుపోయే మొండి కొవ్వును సైతం సైక్లింగ్ కరిగిస్తుంది. కాళ్లు, తొడలు, పిక్కల కండరాలను దృఢంగా మార్చడంతో పాటు సరైన శరీరాకృతిని పొందడానికి దోహదపడుతుంది. శారీరక దృఢత్వంతో పాటు మానసిక రక్షణకు కూడా సైక్లింగ్ ఎంతో తోడ్పడుతుంది. సైకిల్ నడుపుతున్నప్పుడు మన మెదడులో ఎండార్ఫిన్లు వంటి హ్యాపీ హార్మోన్లు ఎక్కువగా విడుదలవుతాయి. ఇవి రోజువారీ మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యల నుంచి తక్షణ ఉపశమనం కలిగిస్తాయి. ఉదయాన్నే కాలుష్యం లేని బహిరంగ ప్రదేశాల్లో సైకిల్ తొక్కడం వల్ల లభించే స్వచ్ఛమైన గాలి మానసిక వికాసానికి ఎంతో మేలు చేస్తుంది. ఆల్టర్నేటివ్ ప్రస్తుత కాలంలో చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నిద్రలేమి. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం వేళల్లో సైక్లింగ్ చేయడం వల్ల శరీరం తగినంతగా అలసిపోయి, రాత్రి వేళల్లో త్వరగా, గాఢమైన నిద్ర పడుతుంది. ఇది శరీర అంతర్గత లైఫ్ సైకిల్ ను క్రమబద్ధీకరిస్తుంది. అంతేకాకుండా ఆరు బయట సైక్లింగ్ చేయడం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్ డీ లభిస్తుంది. తద్వారా ఎముకల పుష్టితో పాటు వ్యాధి నిరోధక శక్తి కూడా మెరుగుపడుతుంది. సైక్లింగ్ ప్రారంభించే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. సరైన భంగిమలో సైకిల్ సీటును అమర్చుకోకపోతే నడుము లేదా మోకాళ్ల నొప్పులు వచ్చే అవకాశం ఉంటుంది. సైకిల్ తొక్కేటప్పుడు తగినంత నీరు తాగుతూ శరీరాన్ని ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. పర్యావరణానికి ఎటువంటి కాలుష్యం కలిగించని సైక్లింగ్‌ను మన దైనందిన జీవితంలో ఒక అలవాటుగా మార్చుకుంటే, సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మెరుగైన జీవన ప్రమాణాలను అందుకోవచ్చు.

# టమాటా, ఉల్లిపాయలతో అద్భుతమైన రోటి పచ్చడి!



ప్రతీరోజూ కూరలు వండుకుంటున్నా అప్పుడప్పుడు రోటి పచ్చడి చేసుకు తింటే బాగుంటుంది. రోటి పచ్చడి రుచే వేరుగా ఉంటుంది. మనం టమాటా, ఉల్లిపాయలతో తయారు చేసుకునే అద్భుతమైన రోటి పచ్చడిని ఒకసారి చూద్దాం, ఇది చాలా సింపుల్‌గా, రుచిగా తయారయ్యే చట్నీ. ఇడ్లీ, దోసె, ఉప్మా, రోటీతో తింటే అదిరిపోతుంది. కావాల్సిన పదార్థాలు: టమాటాలు - 3-4 మీడియం సైజ్ పెద్ద ఉల్లిపాయ - 1 పచ్చి మిర్చి - 8 వెల్లుల్లి రెప్పలు - 4-5 జీలకర్ర -½ టీస్పూన్ పెసరపప్పు - 1 టీస్పూన్ కందిపప్పు - 1 టీస్పూన్ ఉప్పు - రుచికి తగినంత నూనె - 2 టేబుల్ స్పూన్లు పోపు గింజలు -½ టీస్పూన్ ఎండు మిర్చి: 2 కరివేపాకు - కొద్దిగా కొత్తిమీర - కొద్దిగా (ఐచ్ఛికం) తయారీ విధానం: టమాటాలు, ఉల్లిపాయను ముక్కలు చేసుకోండి. పచ్చి మిర్చి, వెల్లుల్లి కూడా సిద్ధం చేసుకోండి. పాన్‌లో 1 టేబుల్ స్పూన్ నూనె వేడి చేసి పెసరపప్పు, కందిపప్పు వేసి లైట్‌గా వేయించండి. ఆపై అందులో పచ్చి మిర్చి వేసి కొద్దిసేపు వేయించండి. అందులో ఉల్లిపాయ ముక్కలు వేసి సాఫ్ట్‌గా అయ్యే వరకు వేయించండి. ఆపై టమాటా ముక్కలు కూడా యాడ్ చేసి మొత్తం బాగా మగ్గేలా చూడండి. తర్వాత స్టవ్ ఆఫ్ చేసి మిశ్రమాన్ని చల్లారనివ్వండి. ఇలా చేస్తే టమాటా ఉల్లిపాయ చట్నీ మళ్ళీ మళ్ళీ కావాలంటారు చల్లారిన మిశ్రమం మిక్సీలో వేసి కొద్దిగా నీళ్లు జోడించి ముతకగా గ్రైండ్ చేయండి. అందులో ఉప్పు, జీలకర్ర, వెల్లుల్లి రెబ్బలు, కరివేపాకు, కొత్తిమీర వేసి ఒకసారి మళ్ళీ తిప్పి ఒక బౌల్ లోకి తీసుకోండి. చిన్న పాన్‌లో 1 టేబుల్ స్పూన్ నూనె వేడి చేసి అందులో పోపు గింజలు వేసి, కరివేపాకు, ఎండు మిర్చి వేసి వేగాక చట్నీ మీద పోయండి. ధనియాలు కలిపి సర్వ్ చేయండి. ఈ చట్నీ టిఫిన్స్ లోకి, అన్నంలోకి అద్భుతంగ ఉంటుంది. ఒక్కసారి ట్రై చేస్తే మళ్ళీ మళ్ళీ మీరే చేస్తారు.

# గరం గరం ఇలాచీ టీ: రెగ్యులర్ చాయ్ కు బెస్ట్ ఆల్టర్నేటివ్



సాధారణంగా వేడి వేడి టీని ఇష్టపడని వారెవరూ బహుశా ఉండకపోవచ్చు. ఉదయం, సాయంత్రం వేళ.. టీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. వేడి వేడి టీ కడుపులో పడ్డాకే మిగిలిన పనుల్లో నిమగ్నమవుతారు. సాధారణ టీకి బదులుగా అందులో యాలకులను వేస్తే దాని రుచి మారిపోతుంది. ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. రెగ్యులర్ గా తాగే చాయ్‌కు మంచి ప్రత్యామ్నాయం కూడా. రోజువారీ జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పును తీసుకొస్తుంది. వంటకాల్లో యాలకులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రాచీన కాలం నుండి వీటిని సువాసన కోసమే కాకుండా వివిధ రకాల ఆయుర్వేద మూలికా వైద్యంలో ఉపయోగిస్తున్నారు. దీన్ని టీ లో కూడా చేర్చుకోవడం వల్ల పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. యాలకుల (ఇలాచీ) టీ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి అద్భుతంగా తోడ్పడుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలు దెబ్బతినకుండా నిరోధిస్తాయి. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చలికాలంలో వేధించే గొంతు నొప్పి, శ్వాసకోశ ఇబ్బందుల నుండి త్వరితగతిన ఉపశమనాన్ని కలిగిస్తాయి. అలాగే రక్తపోటును అదుపులో ఉంచుతుంది. రక్త ప్రసరణను క్రమబద్ధీకరించడంలో కూడా ఎంతగానో సహాయపడుతుంది. అధిక బరువుతో ఇబ్బంది పడేవారికి యాలకుల టీ ఓ మంచి ప్రత్యామ్నాయం. ఫ్యాటీ ఫుడ్ తీసుకున్నప్పుడు శరీరంలో అదనపు కొవ్వు పేరుకుపోకుండా యాలకుల పొడి అడ్డుకుంటుంది. దీనివల్ల బరువు నియంత్రణలో ఉంటుంది. అమెరికా నుంచి కొనుగోలు శ్వాసకోశ ఇబ్బందులతో సతమతమయ్యే వారికి యాలకుల టీ ఒక అద్భుతమైన సహజ సిద్ధమైన ఔషధంగా పనిచేస్తుంది. యాలకుల్లో పుష్కలంగా ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఊపిరితిత్తులలో పేరుకుపోయిన కఫాన్ని కరిగించి, శ్వాస ప్రక్రియను సులభతరం చేస్తాయి. జలుబు, దగ్గు, అస్తమా వంటి సమస్యలకు ఇది ఎంతో ఉపశమనం ఇస్తుంది.

# రోజూ చపాతీలు తింటున్నారా- అయితే, ఇది తెలుసుకోవాల్సిందే..!!



ప్రతీ ఇంటి చపాతీలు ఎక్కువగా వినియోగిస్తారు. మారుతున్న ఆహారపు అలవాట్లతో అన్నం స్థానం లో చపాతీలకు ప్రాధాన్యత పెరుగుతోంది. చపాతీ, పుల్కా వంటి వాటిని ఆరోగ్యం కోసం ప్రాధాన్యత ఇస్తున్నారు. అనేక ఆరోగ్య సమస్యలకు చపాతీ ఆహారం మేలు చేస్తుంది. ఇదే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవా ల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. చపాతీలతో పాటుగా తీసుకునే కూరల విషయంలోనూ సూచనలు చేస్తున్నారు. గోధుమ పిండిలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. చపాతీలు సాధారణంగా గోధుమపిండితో తయారు చేస్తారు. ఇందులో ఉండే ఫైబర్ ఆరోగ్యానికి మంచిదేనని నిపుణులు చెబుతున్నారు. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుందని, మలబద్ధకాన్ని నివారిస్తుందని, పేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇందులో బి1, బి2, బి3, బి6, బి9, ఇ విటమిన్లతో పాటు ఐరన్, కాపర్, మాంగనీస్?, సిలికాన్, మెగ్నీషియం, ఫాస్ఫరస్, పొటాషియం, అయోడిన్, జింక్, కాల్షియం వంటి ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయని పేర్కొంటున్నారు. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉండొచ్చని పేర్కొంటున్నారు. చపాతీలు రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయని, డయాబెటిస్?తో బాధపడుతున్న వారికి లేదా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించా లనుకునే వారికి మంచిది. పరిమితి మేరకు తీసుకుంటే ప్రయోజనం చపాతీల్లో ఉండే బి విటమిన్లు, జింక్, ఇతర ఖనిజాలు చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహకరిస్తాయి. చపాతీలు గుండె ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. చపాతీ ఆరోగ్యానికి మంచిదే కదా అని ఎక్కువ నూనె, నెయ్యితో చేసుకోవడం వల్ల బాడీలో అనవ సర కొవ్వులు చేరతాయని నిపుణులు చెబుతున్నారు. పుల్కా చేసుకొని తింటే మరీ మంచిదని పేర్కొంటున్నారు. మార్కెట్లో దొరికే పిండిలో మైదా కూడా కలిసి ఉంటుందని, కాబట్టి ముడి గోధుమ లు తీసుకొని స్వయంగా పట్టించుకొని ఆ పిండితో చపాతీ చేసుకుంటే మంచిది. చపాతీ లో కాంబినే షన్ కోసం పప్పు.. బంగాళాదుంప కర్రీ అని కాకుండా అన్ని రకాల కాయగూరలతో చేసిన కూరలు తీసుకోవడం వల్ల పోషకాలన్నీ శరీరానికి అందుతాయని సూచిస్తున్నారు. ఈ క్రమంలో క్యారెట్ ముక్కలు, బీన్స్, పాలకూర వంటి వాటిని ఉడికించి, గోధుమ పిండి కలుపుకొని చపాతీలు చేసు కుంటే అటు రుచికి, ఇటు ఆరోగ్యానికి ఆరోగ్యం.

# శ్రీవారి భక్తులను మోసగిస్తున్న 249 వెబ్ సైట్లు




తిరుమల సెప్టెంబర్ 2, కిలీ వెబ్‌సైట్ల గురించి తిరుమల శ్రీవారి భక్తులను టీటీడీ మరోసారి అప్రమత్తం చేసింది. గదుల కేటాయింపు పేరుతో ఆకర్షణీయమైన ప్రకటనలు ఇస్తూ.. పోస్టర్లు, తప్పుడు హామీలతో భక్తులను మోసం చేస్తున్న 249 నకిలీ వెబ్‌సైట్‌లను ఈ సంవత్సరం ఇప్పటివరకు గుర్తించినట్లు టీటీడీ తెలిపింది. ఆ ఫేక్ వెబ్‌సైట్లను తొలగించామని.. రెండు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపింది. ఆన్‌లైన్‌లో టీటీడీ పేరుతో కనిపించే నకిలీ వెబ్‌సైట్‌లు, లింక్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని భక్తులను హెచ్చరించింది. శ్రీవారి దర్శనం, వసతి, సేవలు, టోకెన్ల విషయాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని.. తిరుమలకు సంబంధించిన అన్ని సేవలు, నిబంధనలు, మార్గదర్శకాలపై అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. దర్శనం, గదుల కేటాయింపు అంటూ మోసాలకు పాల్పడుతున్న దళారులపై ఈ ఏడాది ఇప్పటివరకు 30 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు టీటీడీ వెల్లడించింది. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన 43 మంది టీటీడీ ఉద్యోగులపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. తిరుమలకు వచ్చే భక్తులు తమ సూచనలు, నిబంధనలు పాటిస్తూ.. భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకోవాలని సూచించింది. ఇక తిరుమలకు వచ్చే వెంకన్న భక్తులు తమ వెంట తీసుకువచ్చే వస్తువులపైనా టీటీడీ కీలక సూచనలు చేసింది. తిరుమలకు వచ్చే వాహనాల్లో నిషేధిత వస్తువులను తరలించకుండా అలిపిరి, శ్రీవారిమెట్టు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు టీటీడీ తెలిపింది. నిషేధిత వస్తువులను గుర్తిస్తే.. అలిపిరి టోల్‌గేట్ స్కానింగ్ కేంద్రం వద్దనే సీజ్ చేస్తున్నట్లు తెలిపింది. ఈ సంవత్సరం ఇప్పటివరకు అలిపిరి వద్ద 261 డ్రోన్లు, 105 మెటా స్మార్ట్ గ్లాసెస్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. తిరుమల క్షేత్రంలో భద్రత, గోప్యతను దృష్టిలో పెట్టుకుని శ్రీవారి భక్తులు.. డ్రోన్లు, స్మార్ట్ గ్లాసెస్ వంటి రికార్డింగ్ పరికరాలను తమ వెంట తీసుకురావద్దని విజ్ఞప్తి చేసింది. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోందన్న టీటీడీ.. పరిమితికి మించి వస్తున్నప్పటికీ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించింది. వైకుంఠ ఏకాదశి, రథసప్తమి, బ్రహ్మోత్సవాలు వంటి సమయాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించింది. నిర్దేశిత సమయానికే భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించేలా అన్ని విభాగాలు సమిష్టిగా, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం పేర్కొంది. తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. గత ఆరు నెలలుగా కొండపై భక్తుల రద్దీ పెరిగింది.. ముఖ్యంగా వీకెండ్, సెలవు రోజుల్లో భక్తుల రద్దీ ఎక్కువా కనిపిస్తోంది. టీటీడీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తోంది. తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు భారీగా తరలి వస్తుండటంతో స్వామివారి హుండీకి భారీగా ఆదాయం సమకూరుతోంది. గత రెండు, మూడు నెలలుగా వెంకన్నకు కాసుల వర్షం కురిసింది. తాజాగా ఆగస్టు నెలలోనూ స్వామివారికి భారీగా ఆదాయం వచ్చింది. తిరుమల శ్రీవారిని ఆగస్టు నెలలో 24,56,017 మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు వేంకటేశ్వరస్వామివారికి రూ.137.44 కోట్లు కానుకల రూపంలో సమర్పించారు. అలాగే1.30 కోట్ల లడ్డూలను విక్రయించారు. 10.50 లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఆగస్టు నెలలో ఏకంగా మూడుసార్లు హుండీ ఆదాయం రూ.5 కోట్లు దాటింది. ఆగస్టు 18న అత్యధికంగా 6.12 కోట్ల ఆదాయం సమకూరింది. ఆగస్టు 16న అత్యధికంగా 97,014 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా.. ఆగస్టు 15న అత్యధికంగా 53,090 మంది తలనీలాలు సమర్పించారు. ఆగస్టు 19 నుంచి 28 మధ్య రద్దీ తీవ్రంగా ఎక్కువగా ఉంది.. ఆ సమయంలో దర్శనానికి గరిష్ఠంగా 24 గంటల వరకు సమయం పట్టింది. మరోవైపు రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో కారీరిష్టి యాగం, వరుణజపం, పర్జన్యశాంతి హోమాలు సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కెఎస్ఎస్.అవధాని ఆధ్వర్యంలో 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో యాగాలు, జపాలు, పారాయణాలు నిర్వహిస్తున్నారు. ఆరుగురు ఋత్వికులు కారీరిష్టి యాగం చేపడుతున్నారు. 12 మంది ఋత్వికులు గోగర్భం తీర్థంలో నడుము లోతు నీళ్లలో నిల్చుని వరుణ, పర్జన్య మంత్రాలను పఠించారు. అదేవిధంగా ఏడు వేద శాఖలకు చెందిన 14 మంది ఋత్వికులు రామాయణం, భాగవతం, మహాభారతంలోని విరాటపర్వం పారాయణం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. టీటీడీ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో సెప్టెంబరు 4న గోకులాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీకృష్ణ జన్మదిన వేడుకలకు గోసంరక్షణశాల ఆధ్యాత్మిక వేదికగా నిలవనుంది. భక్తిభావాన్ని పెంపొందించేలా గోపూజతో పాటు వేదపఠనం, భజనలు, కోలాటాలు, సంకీర్తనలు, హరికథ తదితర కార్యక్రమాలను టీటీడీ నిర్వహించనుంది. గోకులాష్టమి రోజున ఉదయం 5 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామివారికి అభిషేకం, 6 గంటలకు వేణుగానం, 7.30 గంటలకు వేదపఠనం నిర్వహిస్తారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులచే భజనలు, కోలాటాలు, ఉదయం 8 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే శ్రీహరి సంకీర్తనలు ఆలపిస్తారు. ఉదయం 10 గంటలకు శ్రీ వేణుగోపాలస్వామివారి సన్నిధిలో గోపూజ, హారతి నిర్వహిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. భక్తులకు స్వామివారి దర్శనం, ప్రసాదం పంపిణీ చేస్తారు. సాయంత్రం టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని దివ్య లీలలు, గోసేవ మహత్యాన్ని వివరించే హరికథ నిర్వహించనున్నారు.

## ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు

నెల్లూరు, సెప్టెంబర్ 2,ఏపీలో ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు ముసురుకుంటున్నాయా? అన్న చర్చ జరుగుతోంది. ఉద్యోగుల డిమాండ్ల సాధనకంటూ ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మూడు దశల ఉద్యమ కార్యాచరణ ప్రకటించగా, ఆయన తీరును నిరసిస్తూ రెవెన్యూ ఎంప్లాయిస్ యూనియన్, ఏపీ జేఏసీ నేతలు వేర్వేరుగా మీడియాకు ఎక్కడం చర్చనీయాంశం అవుతోంది. ప్రధానంగా ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు రహస్య రాజకీయ అజెండా అమలు చేస్తున్నారని మిగిలిన ఉద్యోగ సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వంతో సానుకూల సహకారాన్ని కోరుకుంటూనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను కించపరిచేలా బొప్పరాజు వ్యాఖ్యలు ఉన్నాయని తప్పుపడుతున్నారు. దీంతో ఉద్యోగ సంఘాల నేతలపై ఉద్యోగుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చాలా ఆశలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఉద్యోగుల పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపు వంటి ఆర్థికాంశాలుపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. గత రెండేళ్లలో రూ.22 వేల కోట్ల బకాయిల చెల్లింపు, ఒకటో తేదీన జీతాలు, 10 వేల మంది ఉద్యోగులకు ఓపీఎస్, 8 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం వంటి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చినా ఆర్థిక ప్రయోజనాలు అందజేయడంలో ఇంకా నిర్లక్ష్యం వహిస్తోందని ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అంటూ ఉద్యోగ సంఘాల జేఏసీలు ప్లాన్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా అమరావతి జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గత శుక్రవారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. అయితే ఆ సమావేశానికి హాజరైన వివిధ సంఘాల నేతలు, కొందరు కమ్యూనిస్టు పార్టీల నేతలు ఉద్యోగుల సమస్యలపై కాకుండా, రాజకీయ లక్ష్యాలతో మాట్లాడినట్లు కనిపిస్తోందని రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు అనుమానం వ్యక్తం చేస్తూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేయడం సంచలనం రేపుతోంది. ప్రధానంగా అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు లక్ష్యంగా భూపతిరాజు రవీంద్రరాజు చేసిన వ్యాఖ్యలు హీట్ పుట్టిస్తున్నాయి. బొప్పరాజు ఆధ్వర్యంలోని జరిగిన సదస్సులో కొందరు నాయకులతో బయట నుంచి వచ్చిన స్క్రిప్టు ప్రకారం మాట్లాడించేందుకు ప్రయత్నించారని చేసిన ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. సీఎం చంద్రబాబును విమర్శించడం, ఆయనపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడమే కాకుండా, సీఎం సతీమణి వ్యాఖ్యలను కూడా వ్యంగ్యంగా స్క్రీన్ పై ప్రదర్శించారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యంతో బాధపడుతుంటే ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని భూపతిరాజు రవీంద్రరాజు మండిపడుతున్నారు. ఇక బొప్పరాజు నిర్వహించిన సదస్సుకు సంబంధం లేకుండా ఉద్యోగుల సమస్యలపై తాము సొంతంగా నిర్ణయం తీసుకుంటామని ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ ప్రకటించారు. సమస్యల పరిష్కారానికి ముందుగా మంత్రులతో చర్చిస్తామని, అనంతరం ముఖ్యమంత్రితో భేటీ అవుతామని విద్యాసాగర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీంతో అమరావతి జేఏసీతో సంబంధం లేకుండా తాము పనిచేస్తామని ఏపీ జేఏసీ తేల్చిచెప్పినట్లైంది. మరోవైపు బొప్పరాజు ప్రకటించి ఉద్యమ కార్యాచరణతోపాటు ముఖ్యమంత్రిపై విమర్శలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఉద్యోగులు-ప్రభుత్వం మధ్య సఖ్యతను చెడగొట్టేలా బొప్పరాజు వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నారని రెవెన్యూ మంత్రి ఆరోపించారు. తాము ఉద్యోగ సంఘాల డిమాండ్లపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నప్పటికీ, గత ప్రభుత్వ బకాయిలను తమకు అంటగడుతూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ఈ పరిణామాలతో అమరావతి జేఏసీ ప్రకటించిన మూడు దశల ఉద్యమ కార్యాచరణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని ఆ సమావేశంలో బొప్పరాజు ప్రకటించినప్పటికీ, ఆయన సమక్షంలో కొందరు నేతలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వంతో సంబంధం లేని ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరిపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## వైసీపీ లోగుట్టు...దిద్దుకోకపోతే భారీ షాక్

విజయవాడ, సెప్టెంబర్ 2, వైసీపీ పైకి పటిష్టంగా ఉన్నట్లుగా కనిపిస్తోంది. కానీ సంస్థాగతంగా ఎన్నో లోపాలు సమస్యలు ఉన్నాయని అంటున్నారు. రాజకీయాల్లో జనాదరణ ఉండడం ఒక్కటే కొలమానం కాదు, ప్రజాకర్షణ అంటే జనాలను ఎక్కువగా తమ సభలకు రప్పించుకోవచ్చు. జేజేలు పలికించుకోవచ్చు. అయితే అవన్నీ ఓట్లు కావు. ఓట్లుగా మారాలంటే ఆ కథ వేరేగా ఉంటుంది. పొలిటికల్ గ్లామర్ వేరు పొలిటికల్ గ్రామర్ వేరు. గ్లామర్ లేకుండా గ్రామర్ ఉన్నా రాజకీయంగా రాణించవచ్చు. కానీ గ్లామర్ ఉండి గ్రామర్ లేకపోతే మాత్రం మనుగడ కష్టంగా మారుతుంది. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. పుబ్బలో పుట్టి మఖలో మాడిపోయిన పార్టీలు కూడా ఉన్నాయి. ఎంతో మంది సెలబ్రిటీలకు తరగని జనాదరణ ఉంటుంది. కానీ వారు రాజకీయంగా పార్టీలు పెట్టి



ఎందుకు ఫెయిల్యూర్ అవుతున్నారు అంటే పొలిటికల్ గ్రామర్ లేకపోవడమే అన్నది నిష్టుర సత్యం. ఇటీవల కాలంలో కొన్ని సర్వేలు వస్తున్నాయి. వైసీపీ గ్రాఫ్ పెరుగుతోంది అని అంటూ. అందులో అతిశయోక్తులు పక్కన పెడితే నిజాలు కూడా ఉన్నాయి. ఎలా అంటే అధికారంలో ఉన్న పార్టీకి యాంటీ ఇంకెంబెన్సీ అన్నది సహజం. మరి అది ప్రతిపక్షానికే టర్న్ అవుతుంది. అలా వైసీపీకి కూడా జరిగి ఉండొచ్చు. కానీ అలా గ్రావిటీ మాదిరిగా వస్తున్న ఈ యాంటీ ఇంకెంబెన్సీని ఒడిసి పట్టుకుని తమకు అనుకూలంగా చేసుకునే సామర్థ్యం సత్తా వైసీపీకి ఏ మేరకు ఉన్నాయన్నదే అసలైన ప్రశ్నగా ముందుకు వస్తోంది. వైసీపీ పెట్టి పదిహేనేళ్ళు అయింది కదా ఆ పార్టీ బలంగా ఉంది కదా అంటే అవన్నీ కరెక్టే కానీ ఈ రోజున ఎలా గ్రౌండ్ లెవెల్ లో ఉంది అన్నదే ముఖ్యమని అంటున్నారు. కానీ ఆయన పేరుతో వచ్చే ప్రతీ ఓటుని జాగ్రత్తగా ఈవీఎంలలో వేయించుకునే స్తోమత కలిగిన పార్టీ యంత్రాంగం జిల్లాలలో నియోజకవర్గాల స్థాయిలో ఉందా అన్నదే పెద్ద చర్చ. వైసీపీ 2024లో ఓటమి పాలు అయ్యాక చాలా మంది పార్టీని వీడిపోయారు. దాని కంటే ముందు చూస్తే అనేక మంది సైలెంట్ అయ్యారు. ఇక వైసీపీ చేసిన రాజకీయ బదిలీలు షిఫ్టింగులు అన్నీ కూడా ఆ పార్టీకి అధిక శాతం అసెంబ్లీ నియోజకవర్గాలలో బలమైన ఇంచార్జిల లోటుని స్పష్టంగా చూపిస్తున్నాయని అంటున్నారు. ఒక ప్రముఖ సెఫాజలిస్టు తాజాగా వైసీపీ గ్రౌండ్ లెవెల్ పరిస్థితి గురించి మాట్లాడుతూ వైసీపీకి జనంలో ఆదరణ పెరిగినా అది ఓట్లుగా మార్చుకునేలా పార్టీ యంత్రాంగం ఉండాలని అన్నారు. నూటికి డెబ్బై శాతం అసెంబ్లీ నియోజకవర్గాలలో వైసీపీకి వీక్ అయిన ఇంచార్జిలే ఉన్నారని అన్నారు. వీరంతా వైసీపీకి ఓటు బ్యాంక్ ని పెంచే వారు కారని కూడా చెప్పుకొచ్చారు.వ్ వచ్చే ఎన్నికల నాటికి వైసీపీ బలమైన అభ్యర్థులతో బరిలోకి దిగాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎందుకంటే కూటమి బలంగా ముందుకు వస్తుందని దానిని ఢీ కొట్టాలంటే వైసీపీ ఇంచార్జిలు అన్ని విధాలుగా ఆరి తేరిన వారు అయి ఉండాలని అభిప్రాయపడ్డారు.. వైసీపీకి చెందిన 175 అసెంబ్లీ ఇంచార్జిలతో ఇటీవల అధినాయకత్వం కీలక సమావేశాన్ని నిర్వహించింది. అలాగే వారి పని తీరుని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నామని చెబుతోంది. మరి అన్నీ చేస్తున్న వైసీపీ పెద్దలకు ఈ వీక్ పాయింట్ ఏంటో స్పష్టంగా తెలియదా అన్నది ఒక చర్చ. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ వ్యవధి ఉంది కాబట్టి వైసీపీ సంస్థాగతంగా బలంగా ఉండేలా ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలకు దిగాలని హితైషులు సూచిస్తున్నారు. లేకపోతే భారీ షాక్ తగిలినా తగలవచ్చు అని అంటున్నారు.

# ఎర్రదొడ్డికి 1,526 పట్టాదార్ పాస్‌బుక్‌లు మంజూరు

### లబ్ధిదారులకు పాస్‌బుక్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి


కోడుమూరు, సెప్టెంబర్ 2 ఎర్రదొడ్డి గ్రామ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. గ్రామానికి దాదాపు 1,526 పట్టాదార్ పాస్‌బుక్‌లు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఎర్రదొడ్డి గ్రామంలో ప్రత్యేకంగా గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామసభ కార్యక్రమానికి కోడుమూరు శాసనసభ్యులు శ్రీ బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథిగా హాజరై, అర్హులైన లబ్ధిదారులకు పట్టాదార్ పాస్‌బుక్‌లను పంపిణీ చేశారు. పాస్‌బుక్‌లు అందుకున్న రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టాదార్ పాస్‌బుక్‌లు రైతులకు ఎంతో కీలకమైనవని, భూమికి సంబంధించిన హక్కులు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామసభలో రైతులు, గ్రామస్థులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. భూ సంబంధిత సమస్యలు, పాస్‌బుక్‌లకు సంబంధించిన అంశాలను పరిష్కరించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవానికి నో అగ్రీ...

విజయవాడ, సెప్టెంబర్ 2, ఏకగ్రీవం వద్దు అని మరోసారి స్పష్టం చేశారు వైసీపీ చీఫ్ వైఎస్ జగన్. అది కూడా తన సొంత జిల్లా సొంత ప్రాంతం పులివెందుల వేదికగా ఆయన బిగ్గర స్వరం వినిపించారు. ఏకగ్రీవాలు అన్న మాటే వద్దు అని వైసీపీ లీడర్ ని క్యాడర్ ని ఆదేశించారు. ప్రతీ చోటా వైసీపీ పోటీ చేసి తీరాల్సిందే అని కూడా జగన్ గట్టిగానే దిశా నిర్దేశం చేశారు. దాంతో ఏపీలో ఏకగ్రీవాల విషయంలో బిగ్ వార్ కూటమి వర్సెస్ వైసీపీగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకే రోజున అటు ప్రభుత్వ అధినేత చంద్రబాబు ఏకగ్రీవాలు అన్నవి అవసరమని ఆహ్వానించారు. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు సభలో బాబు ఏకగ్రీవాల మీద కీలక వ్యాఖ్యలు చేశారు. దానికి ధీటుగా పులివెందుల నుంచి జగన్ పోటీ ఉండాల్సిందే అంటున్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ నేతలు అంతా ఒక చాలెంజ్ గా తీసుకోవాలని జగన్ కోరారు. ఆయన పులివెందులలో పార్టీ నేతల సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. అసలు ఎక్కడా ఏకగ్రీవం అన్నదే వద్దు, దానికి అసలు చాన్స్ ఇవ్వవద్దు అని చెప్పారు. ప్రతీ చోటా ప్రతీ సీటుకూ వైసీపీ పోటీ పడి తీరాల్సిందే అని కూడా జగన్ అన్నారు. ఇక అధికార పార్టీ నుంచి బెదిరింపులు వచ్చినా లేదా పోలీసులను ప్రయోగించినా దౌర్జన్యాలకు పాల్పడినా కూడా వైసీపీ శ్రేణులు ధైర్యంగా ఎదుర్కోవాలని జగన్ కోరారు. భయపడకండి అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుంది అని జగన్ భరోసా ఇచ్చారు. అంతే కాదు వైసీపీ హయాంలో జరిగిన మేలుని, ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. ఏకగ్రీవాలు మేలు అని గ్రామ స్థాయిలో కక్షలు కార్పణ్యాలకు తావు లేకుండా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అంటున్నారు. ప్రభుత్వాలే వాటిని ప్రోత్సహిస్తూ వస్తున్నాయని కూడా ఆయన వివరంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఏకగ్రీవాలు అన్నవి గతంలో జరిగినవే అన్న సంగతిని కూటమి నేతలు గుర్తుకు తెస్తున్నారు. ఇక అధికారంలో ఏ పార్టీ ఉంటే వీలుగా ఏకగ్రీవాలు చేసుకోవడం ఎప్పటి నుంచో జరుగుతూ వస్తోంది. అలాంటిది అసలు ఏకగ్రీవం అన్న మాటే వినిపించకూడదని జగన్ ఒకటికి పదిసార్లు చెబుతున్నారు. అంటే పోటీకి వైసీపీ సై అంటోంది. అలాంటి పరిస్థితి ఉంటే కనుక అది గ్రామ స్థాయిలో కానీ పల్లెలలో కానీ ఒక రాజకీయ సమరానికే దారి తీస్తుందని అంటున్నారు. ఢీ అంటే ఢీ అంటూ రాజకీయం సాగి ప్రశాంత వాతావరణం వేడెక్కిపోతుంది అని అంటున్నారు. నిజంగా పోటీకి మరో పక్షం సిద్ధంగా ఉంటే అది ప్రజాస్వామిక విధానంగా చూడాలి. అలా కాకుండా పోటీని అనివార్యం చేయడం తగదన్న మాట వినిపిస్తోంది. అలాగే పోటీకి సిద్ధంగా ఎవరైనా ఉంటే ఏకగ్రీవం పేరుతో వారి గొంతు నొక్కే తీరు మంచిది కాదని అంటున్నారు. ఏది ఏమైనా ఏపీ అంతటా ఒకేలా రాజకీయం ఉండదు, స్థానికంగా ఉండే పరిస్థితుల బట్టి అది మారుతూ ఉంటుంది. అందువల్ల ఏకగ్రీవాలు వద్దు అని వైసీపీ బిగ్ సౌండ్ చేసినా అలాగే కావాలని కూటమి కోరినా అది స్థానిక పరిస్థితులను విశేషంగా ప్రభావితం చేస్తుందని అంటున్నారు. ఎక్కడికక్కడ లోకల్ గా ఎవరికి వారు నిర్ణయించుకోవాల్సిన ఎన్నికలను ప్రతిష్టగా మార్చాలనుకుంటే భీకర పోరుకు నాంది పలికినట్లు అవుతుందని అంటున్నారు.

## రోజుకు 18 గంటల డ్యూటీతో చంద్రన్న

తిరుపతి సెప్టెంబర్ 2, దేశవ్యాప్తంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల పనితీరుపై ఢిల్లీ ఐఐఎం నిపుణులు అధ్యయనం చేశారు. దీనికి సంబంధించిన రిపోర్టును కొన్ని రోజుల్లోనే బహిర్గతం చేయనున్న ట్టు జాతీయ మీడియా వెల్లడించింది. దీనిలో ప్రధానంగా ఏపీ సీఎం చంద్రబాబు పనితీరుకు నిపుణులు ఎక్కువ మార్కులు వేయడం గమనార్హం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బీహార్, ఏపీ, ఒడిశా సహా పలు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి పాలన సాగుతోంది.ఏ దేశానికైనా గొప్ప విజయం ఆయా రాష్ట్రాల్లోని ముఖ్యమంత్రుల పనితీరు విషయంపై అధ్యయనం చేసిన ఢిల్లీఐఐఎం.. ప్రజా సేవకు, పాలనకు వారు కేటాయిస్తున్న సమయం.. వారంలో ఎన్నిరోజులు పనిచేస్తున్నారు.. అనే విషయాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తోంది. దీనిలో ఏపీ సీఎం చంద్రబాబు రోజులకు 12 గంటల పాటు పనిచేస్తున్నట్టు చెప్పడం గమనార్హం. వాస్తవానికి చంద్రబాబు రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారని.. ఆయనే స్వయంగా చెబుతున్నారు. అయితే.. ఐఐఎం ఢిల్లీ మాత్రం 12 గంటలు నిర్విరామంగా పనిచేస్తున్నారని పేర్కొంది. ఇక, వారంలో ఆరు రోజుల పాటు సీఎం చంద్రబాబు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని.. పేర్కొంది. అలానే.. పాలన విషయంలో 24 గంటలూ స్పందిస్తున్నారని తెలిపింది. ఇక, మంత్రి వర్గంతో అత్యంత సఖ్యతగా ఉంటున్న సీఎంగా కూడా.. చంద్రబాబుకు తొలిస్థానం ఇచ్చింది. మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు ఆయన నివేదికలు తెప్పించుకుని సరిచేసుకుంటున్నారని పేర్కొంది. అవినీతి రహిత పాలన అందించేందుకు ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషి బాగుందని కితాబివ్వడం గమనార్హం. కానీ, సీఎం సువేందు అధికారి కేవలం 6 గంటలు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపింది. బీహార్ ముఖ్యమంత్రి కూడా 6 గంటలకే పరిమితం అవుతున్నారని.. వారానికి 5 రోజులు మాత్రమే పనిచేస్తున్నారని చెబుతోంది. కాగా.. ఈ రిపోర్టుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలోనే వెల్లడించనున్నారు. ప్రజాభిప్రాయాలు.. పాలన తీరు, తీసుకుంటున్న నిర్ణయాల ఆధారంగా ఈ నివేదికను రెడీ చేస్తున్నారని సమాచారం.






# ఫేక్ ఇంజూరీ.. పాక్ ప్లేయర్ ఇమామ్‌పై పీసీబీ విచారణకు ఆదేశం!



పాకిస్థాన్ క్రికెట్‌లో మరో వివాదం ముదురుతోంది. ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన రెండో టెస్టులో గాయమని నటించి బ్యాటింగ్‌కు రాలేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న పాక్ ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్ చిక్కుల్లో పడ్డాడు. అతడి ఫేక్ ఇంజూరీపై విచారణకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సిద్ధమవుతోంది. అవసరమైతే ఇమామ్ న్యాయపరంగా సహాయం తీసుకునే అవకాశముందని సమాచారం. రెండో టెస్టులో ఇమామ్ కండరాలు పట్టేశాయని చెప్పి రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బ్యాటింగ్‌కు రాలేదు. ఆ మ్యాచ్‌లో పాక్ ఏకంగా 194 పరుగుల తేడాతో ఓడిపోగా.. మూడు టెస్టుల సిరీస్‌ను ఇంగ్లండ్ 2-0తో కైవసం చేసుకుంది.ఇమామ్ గాయంపై పాకిస్థాన్ సెలక్షన్ కమిటీ సభ్యుడు ఆకిబ్ జావెద్ తీవ్రంగా స్పందించాడు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరుగుతుందని స్పష్టం చేశాడు. 'కండరాలు పట్టేశాయనే కారణంతో రెండు ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్‌కు రాకపోవడం ఎలా సాధ్యం? గాయాలు ఆటలో భాగమే. గతంలో కాళ్లకు తీవ్ర గాయాలైన ప్లేయర్లు కూడా మైదానంలోకి వచ్చి ఆడేందుకు ప్రయత్నించారు. కానీ ఈ వ్యవహారం పూర్తిగా భిన్నంగా ఉంది. విచారణ పూర్తయ్యాక తగిన చర్యలు తీసుకుంటాం' అని ఆకిబ్ తెలిపాడు.ఇదిలా ఉంటే.. ఇమామ్ ఉల్ హక్ ఈ విచారణను ఎదుర్కొనేందుకు న్యాయ సలహా తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 'ఇమామ్ ఇప్పుడు కష్టాల్లో ఉన్నాడు. రెండో టెస్టులో అతడి కాలి గాయం కారణంగా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ బ్యాటింగ్ చేయలేకపోయాడన్న అంశంపై పీసీబీ విచారణ కమిటీ ముందు హాజరు కావాల్సి ఉంది. ఆ సమయంలో అతడు న్యాయ సలహా తీసుకునే అవకాశముంది' అని పాక్ క్రికెట్ బోర్డుకు సంబంధించిన ఓ వర్గం తెలిపింది.ఇంగ్లండ్ పర్యటనలో వరుస ఓటములు ఎదురైన నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇమామ్ ఉల్ హక్ సహా ఏడుగురు ఆటగాళ్లపై వేటు వేసింది. అంతేకాకుండా బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్, హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్‌లను కూడా బాధ్యతల నుంచి తప్పించింది. దీంతో ప్రస్తుతం పాకిస్థాన్ జట్టులో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. సెప్టెంబర్ 9 నుంచి బర్మింగ్‌హామ్‌లో మూడో టెస్టు జరగనుంది. ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన పాకిస్థాన్.. కనీసం చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని చూస్తోంది.

# సీఎస్కే కోచ్ విషయంలో అప్పుడే తొందరెందుకు?: రుతురాజ్ గైక్వాడ్




ఐపీఎల్ 2027కి ముందు చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. స్టీఫెన్ ఫ్లెమింగ్ 17 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత కోచ్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో.. ఆ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనే చర్చ మొదలైంది. ఈ క్రమంలో హెడ్ కోచ్ ఎంపికపై సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కొత్త కోచ్‌ను నియమించడానికి ఇంకా చాలా సమయం ఉందని, అప్పుడే తొందరెందుకని తెలిపాడు.'సీఎస్కే జట్టుకు హెడ్ కోచ్ ఉంటాడు. ఫ్లెమింగ్ స్థానాన్ని భర్తీ చేయడం కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచిస్తోంది. ఐపీఎల్‌కు ఇంకా చాలా సమయం ఉంది. కాబట్టి హెడ్ కోచ్ విషయంలో నిర్ణయం తీసుకోవడానికి తొందరేం లేదు' అని రుతురాజ్ వెల్లడించాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ 2008లో సీఎస్కే ప్లేయర్‌గా జట్టులో చేరాడు. ఆ తర్వాతి ఏడాదే హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతడి కోచింగ్‌లో జట్టు ఐదు ఐపీఎల్ టైటిళ్లు, రెండు ఛాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలు గెలుచుకుంది.ధోని నుంచి సీఎస్కే కెప్టెన్సీ పగ్గాలు అందుకున్న రుతురాజ్.. గతేడాది తన జీవితంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పాడు. 'ఎంఎస్ ధోని నుంచి కెప్టెన్సీ తీసుకోవడం చాలా పెద్ద బాధ్యత. అతడు సాధించిన విజయాలు ఎంతో గొప్పవి. సహజంగానే అభిమానులు మరిన్ని విజయాలు, టైటిళ్లను ఆశిస్తారు. అయితే ఈ అదనపు బాధ్యతను నేను ఆస్వాదిస్తున్నా. ఆటను ఆస్వాదిస్తున్నంత కాలం కెప్టెన్‌గా కొనసాగేందుకు సిద్ధంగా ఉన్నా. 2008 నుంచి సీఎస్కే అద్భుతమైన ప్రయాణం సాగించింది. దాదాపు ప్రతి సైకిల్‌లోనూ ఐపీఎల్ ట్రోఫీని సాధించాం. ఇంతటి స్థిరత్వాన్ని సాధించిన ఫ్రాంచైజీలు చాలా తక్కువ. గొప్ప విజయాల సమయంలో అభిమానులు మాకు అండగా నిలిచారు. ఇప్పుడు సీఎస్కే కష్టకాలంలో ఉంది. ఇప్పుడు కూడా అదే మద్దతును అభిమానులు అందించాలి' అని రుతురాజ్ వెల్లడించాడు.

# చైనా మాస్టర్స్: టోర్నీ నుంచి లక్ష్యసేన్ ఔట్

చైనా మాస్టర్స్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 32లో కెనడాకు చెందిన విక్టోర్ లాయ్ చేతిలో లక్ష్య వరుస గేముల్లో ఓటమి పాలయ్యాడు. 14-21, 7-21 తేడాతో లాయ్ చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. ఈ ఓటమితో 2026లో విక్టోర్ లాయ్‌తో లక్ష్య సేన్ హెడ్-టు-హెడ్ రికార్డు 1-3కు పడిపోయింది. ఈ ఏడాది లక్ష్యపై లాయ్‌కు ఇది వరుసగా మూడో విజయం కావడం గమనార్హం.ఇటీవల ఢిల్లీలో జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లోనూ లక్ష్యసేన్‌కు నిరాశే ఎదురైంది. రెండో రౌండ్‌లో అమెరికాకు చెందిన గారెట్ టాన్ చేతిలో ఓడిపోయాడు. చైనా మాస్టర్స్‌లో తొలుత లక్ష్యసేన్ ఫ్రాన్స్‌కు చెందిన అలెక్స్ లానియర్‌తో తలపడాల్సి ఉంది. అయితే ఢిల్లీలో టైటిల్ సాధించిన అనంతరం లానియర్ టోర్నీ నుంచి వైదొలగడంతో.. లక్ష్యకు మరోసారి విక్టోర్ లాయ్‌తో తలపడే అవకాశం వచ్చింది. ఈసారి కూడా ఫలితం లక్ష్యకు అనుకూలంగా రాలేదు.ఇదిలా ఉంటే.. మరో భారత స్టార్ కిదాంబి శ్రీకాంత్ మాత్రం



చైనా మాస్టర్స్‌లో శుభారంభం చేశాడు. రౌండ్ ఆఫ్ 32లో చైనీస్ తైపీకి చెందిన చి యు-జెన్‌ను 21-16, 21-15తో వరుస గేముల్లో ఓడించి రౌండ్ ఆఫ్ 16లోకి దూసుకెళ్లాడు. 2023 సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్‌లో శ్రీకాంత్‌ను తొలి రౌండ్‌లోనే ఓడించిన యు-జెన్‌పై ఈసారి భారత షట్లర్ పైచేయి సాధించాడు. తొలి గేమ్‌లో ఆధిపత్యం ప్రదర్శించిన శ్రీకాంత్.. రెండో గేమ్‌లోనూ ప్రశాంతంగా ఆడి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ అదరగొట్టింది. రౌండ్ ఆఫ్ 32లో థాయ్‌లాండ్‌కు చెందిన టోంకిడ్ సాహెంగ్-టోన్‌రగ్ సాహెంగ్ జోడీని 21-8, 21-9తో చిత్తు చేసి ప్రిక్వార్టర్స్‌కు చేరింది.

# విరాట్ కోహ్లీ సరసన చేరిన సౌతాఫ్రికా స్టార్ ప్లేయర్



టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. తన దూకుడైన బ్యాటింగ్‌తో అనేక రికార్డులను బద్దలు కొట్టాడు. అలానే పలు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. అయితే కొందరు ఆటగాళ్లు కోహ్లీ రికార్డులను బ్రేక్ చేయడం లేదా సమం చేయడం చేస్తున్నారు. తాజాగా సౌతాఫ్రికా స్టార్ ప్లేయర్ క్వింటన్ డికాక్ కూడా కోహ్లీ రికార్డును సమం చేశాడు. మరి..ప్రస్తుతం కరేబియన్ ప్రీమియర్ లీగ్-2026 జరుగుతోంది. సౌతాఫ్రికా స్టార్ ప్లేయర్ క్వింటన్ డికాక్.. బార్బడోస్ ట్రైడెంట్స్ జట్టు తరపున ఆడుతున్నాడు. ఈ లీగ్‌లో డికాక్ సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. తాజాగా వార్నర్ పార్క్ వేదికగా సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ పేట్రియాట్స్‌(ాబి తో జరిగిన మ్యాచ్‌లో డికాక్ అద్భుత సెంచరీతో అదరగొట్టాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి... కేవలం 57 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సర్లతో 106 పరుగులు చేశాడు. ఈ క్రమంలో టీ20 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన మూడో ప్లేయర్‌గా దిగ్గజ క్రికెటర్లు డేవిడ్ వార్నర్, విరాట్ కోహ్లీ రికార్డును సమం చేశాడు.కోహ్లీ, వార్నర్, డికాక్ ఇప్పటివరకు టీ20ల్లో తలో పది సెంచరీలు సాధించారు. ఈ ఫీట్‌ను కోహ్లీ కేవలం 413 ఇన్నింగ్స్‌ల్లో అందుకోగా.. డికాక్ 443 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. ఈ ఫీట్ అందుకునేందుకు డేవిడ్ వార్నర్‌కు 439 ఇన్నింగ్స్‌లు పట్టాయి. ఈ జాబితాలో వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్(22) అగ్రస్థానంలో ఉండగా.. పాక్ కెప్టెన్ బాబర్ ఆజం(13) రెండో స్థానంలో ఉన్నాడు. ఇక సీపీఎల్ మ్యాచ్ విషయానికి వస్తే.. సెయింట్ కిట్స్ అండ్ నెవిస్ పేట్రియాట్స్.. బార్బడోస్ ట్రైడెంట్స్‌పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

# రేపే బీసీసీఐ రివ్యూ మీటింగ్.. గంభీర్, అగార్కర్‌కు బోర్డు నుంచి పిలుపు!




యూకే పర్యటనలో భారత జట్టు వైఫల్యంపై బీసీసీఐ నిర్వహించాలనుకున్న సమీక్ష సమావేశానికి ముహూర్తం ఖరారైంది. వాస్తవానికి ఇంగ్లండ్ పర్యటన పూర్తైన వెంటనే ఈ సమావేశం జరగాల్సి ఉంది. కానీ, జింబాబ్వే పర్యటన, శ్రీలంకలో టెస్ట్ సిరీస్ కారణంగా దీనిని వాయిదా వేశారు. అయితే ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం జరగనున్నట్లు ఓ జాతీయ మీడియా పేర్కొంది.బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్, సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ హాజరు కానున్నారు. ఈ మేరకు బీసీసీఐ నుంచి వారికి పిలుపు వెళ్లిందని సమాచారం. రాత్రికే వాళ్లు ముంబైకి చేరాలని సందేశం వెళ్లినట్లు తెలుస్తోంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటన వైఫల్యంపై ప్రధానంగా చర్చించనున్నారు. అలానే ఆటగాళ్లు తరచూ గాయాల బారిన పడటం, భవిష్యత్తులో జరిగే సిరీస్‌లకు అనుసరించాల్సిన వ్యూహాలపై బీసీసీఐ సభ్యులతో టీమ్ మేనేజ్‌మెంట్ చర్చించనుంది.త్వరలో జరగనున్న న్యూజిలాండ్ పర్యటన, స్వదేశంలో జరిగే బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్, పురుషుల వన్డే ప్రపంచ కప్ 2027కు అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా ఈ సమావేశంలో చర్చకు రానున్నాయని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవికాలం పొడిగింపుపై సెప్టెంబర్ 18న జరిగే వార్షిక సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారని సమాచారం. అగార్కర్, గౌతమ్ గంభీర్ మధ్య మంచి రిలేషన్ ఉండటంతో అతని పదవికాలాన్ని పొగించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది.

# అఫ్గాన్ సిరీస్: సంజు వచ్చాడు.. వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కేనా..?

వైభవ్ సూర్యవంశీ.. 15 ఏళ్ల ఈ యువ సంచలనం బ్యాటింగ్ చూడటానికి రెండు కళ్లు సరిపోవు. భారీ షాట్లతో బౌలర్లను బెంబేలెత్తించే వైభవ్.. అత్యంత పిన్న వయసులోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. అయితే సెప్టెంబర్ 13 నుంచి టీమిండియా.. అఫ్గానిస్థాన్‌లో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది. ఇందుకు సంబంధించిన జట్టును కూడా బీసీసీఐ ప్రకటించింది. స్టార్ బ్యాటర్, వికెట్ కీపర్ సంజు శాంసన్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. అటు వైభవ్ సూర్యవంశీ కూడా జట్టులో ఉన్నాడు. దీంతో అఫ్గానిస్థాన్‌తో సిరీస్‌లో భారత ఓపెనింగ్ జోడీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి నెలకొంది.ఇంగ్లండ్ పర్యటనలో విఫలమైన సంజును జట్టు నుంచి తప్పించి వైభవ్‌కు అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పుడు అభిషేక్ శర్మ-వైభవ్ సూర్యవంశీ ఓపెనర్లుగా బరిలోకి దిగారు. ఇంగ్లండ్‌పై నిరాశపరిచిన వైభవ్.. జింబాబ్వేపై చెలరేగాడు. అయితే అఫ్గాన్ సిరీస్‌లో సంజు రాకతో వైభవ్ సూర్యవంశీకి షాక్ తగిలే అవకాశం ఉంది. ఎప్పటిలాగే సీనియర్ ప్లేయర్లు సంజు శాంసన్-అభిషేక్ శర్మ ఇన్నింగ్స్ ఓపెన్ చేస్తే.. వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తుంది. అక్కడ సంజు లేదా అభిషేక్ విఫలమైతేనే వైభవ్‌కు ఛాన్స్ వచ్చే అవకాశం ఉంటుంది.మరోవైపు, దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ తరపున వైభవ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 6 నుంచి ఫైనల్ మ్యాచ్‌లో ఆడనున్నారు. ఈ మ్యాచ్ సెప్టెంబర్ 11 వరకు జరగనుంది. ఆ వెంటనే అఫ్గానిస్తాన్ సిరీస్ ప్రారంభం కానుంది. ఇషాన్ కిషన్ ఈస్ట్ జోన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. మరి ఈ ఇద్దరూ అఫ్గాన్ సిరీస్ కల్లా సిద్ధంగా ఉంటారా? లేదా? అనేది చూడాల్సి ఉంది.






# నాగార్జున వందో సినిమా




కింగ్ 100 గ్లింప్స్ విడుదల ,అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నాగార్జున కెరీర్‌లోని ప్రతిష్టాత్మక 100వ సినిమా సందడి మొదలైంది. 'కింగ్ 100'గా ప్రచారంలో ఉన్న ఈ ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌ని గ్లింప్స్ ద్వారా రివీల్ చేశారు. సినిమా టైటిల్‌ని 'కింగ్ 100' అని పెట్టడం గమనార్హం. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ పై అక్కినేని ఫ్యామిలీ నిర్మాణంలో తమిళ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. నేడు నాగార్జున పుట్టిన రోజు సందర్భంగా సినిమా ఫస్ట్ గ్లింప్స్ ని రిలీజ్ చేసారు. మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు అనే పవర్ ఫుల్ డైలాగ్‌తో నాగార్జునని పరిచయం చేశారు. గ్లింప్స్ చూస్తుంటే డబ్బు లేని ఓ పేదవాడు కసిగా ఎదిగి, మోసాలు చేస్తూ బాగా సంపాదించి కింగ్ స్థాయికి ఎలా ఎదిగాడు అనేది చిత్రంలో చాలా ఇంట్రెస్టింగ్‌గా చూపించనున్నట్టు అర్థమవుతుంది. మరోవైపు చిత్రంలో ఫాదర్ ఎమోషన్ కూడా ఉండబోతుంది అని, నాగార్జున ఇందులో ఫ్లాష్ బ్యాక్ లో యంగ్ వర్షన్ లో కూడా కనిపించబోతున్నట్టు అర్థమవుతుంది. చిన్న గ్లింప్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తిని రేపుతోంది. కేవలం కొద్ది సెకన్ల వీడియోతోనే చిత్రంపై భారీ హైప్‌ను క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్న అంశం టబు ఎంట్రీ. గతంలో నాగార్జున, టబు కలిసి నటించిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చాలా ఏళ్ల తర్వాత ఈ హిట్ జోడీ మళ్లీ ఒకే సినిమాలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో టబు పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, కథను మలుపు తిప్పే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో ఆమె కనిపించనున్నారని సమాచారం. దీంతో నాగ్-టబు కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. 'నితమ్ ఒరు వానమ్' చిత్రంతో దర్శకుడిగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న రా కార్తీక్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భావోద్వేగాలకు, కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సమాన ప్రాధాన్యం ఇస్తూ నాగార్జున 100వ సినిమాను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే, దర్శకుడు ఈసారి ఫీల్‌గుడ్ కథకు భిన్నంగా మిస్టరీ, యాక్షన్ అంశాలతో కూడిన కథను ఎంచుకున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీని డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్టు గ్లింప్స్ తో తెలియజేశారు.



## ప్యారడైజ్ నుంచి యెష నాగుల కట్టమీద పాట విడుదల





నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' నుంచి మేకర్స్ క్రేజీ అప్‌డేట్‌ను అందించారు. ఈ చిత్రం నుంచి రెండో సింగిల్‌గా మోస్ట్ పాపులర్ ఫోక్ సాంగ్ అయిన 'యెష నాగుల కట్ట మీద' పాటను డిజిటల్ వేదికగా విడుదల చేశారు. తెలంగాణ నేటివిటీని ప్రతిబింబించేలా సాగే ఈ జానపద గీతాన్ని సినిమాలో మరింత మాస్ వైబ్‌తో రీమిక్స్ వెర్షన్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సోషల్ మీడియాలోనూ, ప్రజల నోళ్లలోనూ నానుతున్న ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన రాకింగ్ మాస్ బీట్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. 'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత నానితో పాటు తెరపై ఈ పాటకు రాబోయే మాస్ స్టెప్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చుతున్నాయి. ఈ క్యాచీ సాంగ్‌కు కాసర్ల శ్యామ్ సాహిత్యాన్ని అందించగా, జంగి రెడ్డి మరియు సింగర్ ప్రభ తమ శక్తివంతమైన గాత్రంతో ప్రాణం పోశారు. ఎస్.ఎల్.వి. సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## మహేంద్రగిరి వారాహి ట్రైలర్ విడుదల




టాలీవుడ్ నటుడు సుమంత్ హీరోగా, సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ట్రైలర్ సోషల్ మీడియ వాలో వ్యూస్‌తో దూసుకు పోతుంది. ఇక రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కలిపు మధు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను ప్రముఖ డైరెక్టర్ వెంకీ అట్లూరి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. పరమశివుడి ఆజ్ఞతో మహేంద్రగిరిలో కొలువుదీరి న గ్రామదేవత 'వారాహి మాత' నేపథ్యంతో ఈ కథ సాగుతుంది. మహేంద్రగిరి రాజకుటుంబానికి చెందిన వారు గత 150 ఏళ్లుగా అనుమానాస్పద స్థితిలో వరుసగా మరణిస్తుండటం, ఇదంతా అమ్మవారి శాపం వల్లే జరుగుతోందనే నమ్మకం చుట్టూ ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఆ రహస్యాన్ని ఛేదించేందుకు హీరో సాహసించే తీరు సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వారాహి మాతగా నటి ఐశ్వర్య రాజేష్ అలరించనుండగా, 'స్టార్ బాయ్' సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో ట్రైలర్‌లో సర్ ప్రైజ్ ఎంట్రీ ఇచ్చి అంచనాలను అమాంతం పెంచేశారు. వీరితో పాటు మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, రాజీవ్ కనకాల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్న ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్‌ను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 11, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. వారాహికి ఎదురెళ్లి ఈ శాపాన్ని తప్పిస్తాను' అంటున్నారు సుమంత్. మహేంద్రగిరి రాజ వంశస్థులకు వారాహి అమ్మవారి శాపం ఎలా తగిలింది? అందుకు కారణం ఏంటి? మరి అన్నట్లుగానే ఆ శాపం ఏంటో కథానాయకుడు కనుగొన్నాడా? శాప విమోచనకు ఏం చేశాడు? అన్నది తెలియాలంటే 'మహేంద్రగిరి వారాహి' చూడాల్సిందే. సుమంత్ హీరోగా దర్శకుడు సంతోశ్ జాగర్లపూడి తెరకెక్కించిన సోషియో ఫాంటసీ చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మాళవికా నాయర్, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీ సెప్టెంబరు 11న విడుదల కానుంది.

## ఇరుముడి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్‌కు రెడీ




మాస్ మహారాజా రవితేజ హీరోగా, ప్రతిభావంతుడైన దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన హార్ట్ టచింగ్ బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఇరుముడి' . ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చి అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొదటి రోజు నుంచే అద్భుతమైన పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి కలెక్షన్లతో దూసుకుపోతోంది. రవితేజ కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిన 'ఇరుముడి', భావోద్వేగాలతో కూడిన కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకులను థియేటర్లకు రప్పిస్తూ ఘన విజయంతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. పాన్-ఇండియా స్థాయిలో విడుదలైన యశ్ 'టాక్సిక్' వంటి భారీ బ్జడెట్ చిత్రం బరిలోకి దిగినప్పటికీ, 'ఇరుముడి' క్రేజ్ ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఆ పోటీని సైతం తట్టుకుని రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓవర్సీస్‌లోనూ హౌస్‌ఫుల్ బోర్డులతో స్టాం÷-రగ్ కలెక్షన్లను రాబడుతోంది. రవితేజ మార్క్ ఎనర్జీతో పాటు త్రినాథ్ పాత్రలో ఆయన పండించిన ఎమోషన్స్, శివ నిర్వాణ టేకింగ్, జీవీ ప్రకాశ్ సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. థియేటర్లలో ఇంకా కలెక్షన్ల సునామీ కొనసాగుతున్న తరుణంలోనే, ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించిన ఆసక్తికరమైన సమాచారం బయటకు వచ్చింది. ÷ాజా సమాచారం ప్రకారం, ప్రముఖ దిగ్గజ ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్ 'నెట్‌ఫ్లిక్స్' ఈ చిత్ర డిజిటల్ రైట్స్‌ను భారీ ఫ్యాన్సీ ధరకు దక్కించుకుంది. థియేట్రికల్ రన్ ముగిసే సమయానికి, అంటే సెప్టెంబర్ 18 నుంచి 'ఇరుముడి' చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్‌లో అధికారికంగా స్ట్రీమింగ్ చేయనున్నట్లు తెలుస్తోంది. సినిమా విడుదలైన నాలుగు వారాల విండో తర్వాత తెలుగుతో పాటు ఇతర ప్రధాన భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది.




Edited, Printed, Published and Owned by KASHAPAGA SAHITYA, and Printed at THANMAYEE PRINTERS, D.No. 17-2-539,Shop No.7&8,Saidabad,Hyderabad,Telangana and Published at: H.No. 18-7-731, Gowlipura, Chatrinaka, Hyderabad-500053, Telangana.Editor: KASHAPAGA SAHITYA. “RNI No.TELTEL/2015/64243. Cell:7671859219 E-mail Id: iyyalatelangana@gmail.com